ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పల్నాడు జిల్లా వార్తలు
5
శుక్రవారం 12 జనవరి 2024



నీటిలో నానుతున్న శనగ పైరు (ఫైల్)



మిర్చిపైరులో నిలిచిన నీరు (ఫైల్)

పరిహారం.. ఎప్పటికో?

- మిచౌంగ్‌తో మునిగిన రైతులు
- 4.26 లక్షల ఎకరాల్లో పంట నష్టం
- నష్టంపై ప్రభుత్వానికి వెళ్లిన నివేదికలు
- రోజులు గడుస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం

మిచౌంగ్ ముంచి రోజులు గడుస్తున్నా.. రైతులకు పరిహారంపై ప్రభుత్వం మౌనం వీడటంలేదు. తుఫాన్ కారణంగా చేతికందే దశలోని, కొత్త దశలోని పంటలు పూర్తిగా వర్షార్పణమయ్యాయి. రోజుల తరబడి పంట చేలు వర్షపు నీటిలోనే ఉండటంతో రైతులు నిండా మునిగిపోయారు. ఇటు జిల్లా అధికారులు.. అటు కేంద్ర బృందం పంట నష్టం అంచనాలపై పర్యటించి ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఆలస్యంగా అయినా పంట నష్ట పరిహారం అందుతుందని ఆశించిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వ తీరుతో నిరాశకు గురవుతున్నారు. నెల రోజులు అవుతున్నా ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఊసే లేకపోవడంపై బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 4.26 లక్షల ఎకరాల్లో పంట నష్టం వివరాలు ప్రభుత్వానికి వెళ్లి రోజులు గడుస్తున్నా పరిహారం కోసం రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు.



నీటిలో మునిగివున్న వరి చేను (ఫైల్)

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతుల రెక్కల కష్టం మిచౌంగ్ తుఫాన్ తుడిచిపెట్టేయగా.. పాలకులు పరిహారం గురించి పట్టించుకోకుండా రైతులను పరిహసిస్తున్నారు. తుఫాన్ ఆనవాళ్లు చెదిరిపోయినా నష్ట పరిహారం ప్రభుత్వం నుంచి అందలేదని రైతులు వాపోతున్నారు. ఇంటికి చేరాల్సిన పంటలను వర్షం ముంచేయగా.. ప్రభుత్వం పరిహారం అందజేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. భారీ వర్షాలు, పెనుగాలులు చుట్టేయడంతో రైతులు నిండా మునిగిపోయినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు మిచౌంగ్ తుఫాను తీవ్ర నష్టం కలిగించింది. రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. మిచౌంగ్ తుఫాన్ పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు తీవ్ర నష్టం కలిగించింది. ముఖ్యంగా వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావమే చూపింది. చెరువులను తలపించేలా పొలాలు మునిగిపోయాయి. వరి, పత్తి, శనగ, మొక్కజొన్న, మినుము, పొగాకు తదితర పంటలకు అపార నష్టాన్ని కలిగించాయి. మిరప, అరటి, బొప్పాయి, పండ్లు, పూల తోటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టాలను నమోదు చేశారు. ప్రాథమిక అంచనాల అనంతరం పూర్తి వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇన్‌పుట్ సబ్సిడీకి వ్యవసాయ, ఉద్యాన శాఖలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాయి. కేంద్ర బృందం పరిశీలన పూర్తై రోజులు గడుస్తున్నది. అయితే ఇంత వరకు రైతులకు పంట నష్ట పరిహారం గురించి ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. పరిహారం ఎప్పుడు వస్తుందా అని రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని కోరుతున్నారు. భారీ వర్షాలు రైతులను కోలుకోలేకుండా దెబ్బతీస్తే ఆదుకోవాల్సిన ప్రభుత్వం కూడా పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తుండం తమను దగా చేయడమేనని రైతులు వాపోతున్నారు.

బాపట్ల జిల్లాలో..

సముద్ర తీర ప్రాంతానికి సమీపంలో ఉన్న బాపట్ల జిల్లాను మిచౌంగ్ తుఫాన్ వణికించింది. జిల్లా పరిధిలో పంటలకు అపార నష్టం వాటిల్లింది. 2.68 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు దారుణంగా నష్టపోయారు. వరి పంటకు భారీగా నష్టం వాటిల్లింది. వరి 1.97 లక్షల ఎకరాలు, శనగ 29,750 ఎకరాలు, మినుము 3,605 ఎకరాలు, పొగాకు 14,472 ఎకరాలు, మొక్కజొన్న 9,172 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అధికారులు లెక్కలు కట్టారు. ఉద్యాన పంటలకు 14,030 ఎకరాల్లో నష్టం వాటిల్లగా ఇందులో మిర్చి 10,315 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు తేల్చారు.

గుంటూరు జిల్లాలో ..

మిచౌంగ్ తుఫాన్ కారణంగా గుంటూరు జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. జిల్లాలో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. 1,21,400 ఎకరాల్లో పంటలు దెబ్బతినడంతో రైతులు కోలుకోలేని విధంగా నష్టపోయారు. ప్రధానంగా వరి పంటకు ఎక్కువగా నష్టం జరిగింది. వరి 93,850 ఎకరాల్లో దెబ్బతిన్నది. పత్తి 2,550 ఎకరాలు, మినుము 4,397 ఎకరాలు, శనగ 16,930, పొగాకు 2,430 ఎకరాలు, వెయ్యి ఎకరాల్లో జొన్న, 243 ఎకరాల్లో మొక్కజొన్న, 16,507 ఎకరాల్లో మిరప, 1,497 ఎకరాల్లో అరటి, 1,225 ఎకరాల్లో పూలు, కూరగాయలు, తమలపాకు తోటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపారు.



పొగాకు చేలో నీరు (ఫైల్)

పల్నాడు జిల్లాలో..

పల్నాడు జిల్లాలో 36,725 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. 2,356 ఎకరాల్లో మిరప పంటకు నష్టం వాటిల్లింది. 10,605 ఎకరాల్లో శనగదెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ నిర్ధారించింది. 9,859 మంది రైతులను బాధితులుగా గుర్తించారు. పంట నెలరోజుల వ్యవధిలోనే దెబ్బతినడంతో ఇన్‌పుట్ సబ్సిడీ పరిధిలోకి రాదని వ్యవసాయ శాఖ వెల్లడించింది. నెల రోజుల వ్యవధి పంటకు ఎకరానికి కనీసం రూ.10 వేలు రైతులు ఖర్చు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు రూ.15 వేల వరకు ఖర్చయినట్లు బాధిత రైతులు తెలిపారు. అయినా శనగ పంటకు ఒక్క రూపాయి కూడా పరిహారం అందే పరిస్థితి లేదు. శనగ సాగు చేసుకునేందుకు విత్తనాన్ని 80 శాతం సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేస్తూ చేతులు దులుపుకోవడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. పరిహారం చెల్లించాలని కోరుతున్నా మొర ఆలకించే పాలకులే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంది 1357 ఎకరాల్లో, పొగాకు 1543 ఎకరాల్లో, మొక్కజొన్న 600 ఎకరాల్లో, వరి 2,610 ఎకరాల్లో దెబ్బతిన్నాయి.

ప్రశాంత ఎన్నికలకు చర్యలు



- హింసాత్మక ఘటనలకు తావులేకుండా ఏర్పాట్లు
- 144 శాతం ఈవీఎంలు, 1926 పోలింగ్ కేంద్రాలు సిద్ధం
- కొత్తగా 1,08,507 మందికి ఓటు.. 1,01,370 తొలగింపు
- కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట, జనవరి 11: రానున్న ఎన్నికలు పారదర్శకంగా ప్రశాంత వాతావరణలో నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి హింసాత్మక సంఘటనలకు తావు లేని ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో పోలింగ్ రోజున 12 చోట్ల హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. గత ఎన్నికల్లో పోలింగ్ అధికారి తప్పిదం వల్ల కేసానుపల్లి గ్రామంలో రీపోలింగ్ జరిగిందని, ఈసారి రీపోలింగ్ లేని ఎన్నికలే లక్ష్యంగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ప్రశాంత ఎన్నికలకు రాజకీయ పార్టీలు, ఓటర్లు సహకరించాలని కోరారు. గత ఎన్నికల్లో జిల్లాలో 86 శాతం పోలింగ్ నమోదైందని, ఈ సారి పోలింగ్ శాతం పెంచే దిశగా ఓటర్లను చైతన్య పరిచే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జాబితాల ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని, ఈ నెల 22న తుది ఓటర్ల జాబితాలను ప్రకటిస్తామన్నారు. శుక్రవారంతో ఓట్లకు సంబంధించిన దరఖాస్తుల విచారణ ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు. నామినేషన్ ప్రక్రియ తుది గడువు వరకు ఓటు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ఓటర్లకు ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ఇలా నమోదైన ఓట్లను సప్లమెంటరీ జాబితాలో ముద్రిస్తామన్నారు. గత డిసెంబరు 31 వరకు 1,08,507 మంది కొత్తగా ఓటర్లుగా నమోదు కాగా 1,01,370 ఓట్లు తొలగించనట్లు తెలిపారు. తొలగింపుల్లో మృతులు 60,515, వలసలు 29,078, ఒక వ్యక్తికే రెండు చోట్ల ఓట్లు 11,777 ఉన్నాయన్నారు. కొత్తగా నమోదైన ఓట్లలో 18 నుంచి 21 ఏళ్ల వయస్సు కలిగిన వారే అత్యధికంగా ఉన్నారన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓట్ల వివరాలు..

నియోజకవర్గం	నమోదు	తొలగింపు
మాచర్ల	19,064	16,192
గురజాల	18,408	22,466
వినుకొండ	17,874	15,576
సత్తెనపల్లి	14,632	8,710
నరసరావుపేట	13,312	13,534
పెదకూరపాడు	12,788	7,128
చిలకలూరిపేట	12,429	17,769

దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి నుంచే ఓటు

జిల్లాలో 80 ఏళ్లు దాటిన ఓటర్లు 25,590 మంది, వందేళ్లు నిండినవారు 58 మంది ఉన్నారని తెలిపారు. పింఛన్ లెక్కల ప్రకారం దివ్యాంగులు 34,775 మంది ఉన్నారని, ఓటర్ల జాబితాలో నమోదైన దివ్యాంగులు 26,083 మందే ఉన్నారన్నారు. మిగిలిన వారు ఓటు ఉన్నా దివ్యాంగులుగా ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోలేదని, వీరందరూ బీఎల్‌వోలను సంప్రదించి ఫాం-8 ద్వారా దివ్యాంగులుగా నమోదు చేసుకోవాలని సూచించారు. దివ్యాంగులందరికీ ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. అలాగే 80 ఏళ్లు దాటిన వయోవృద్ధులు కూడా ముందుగా బీఎల్‌వోలకు దరఖాస్తు అందజేస్తే ఇంటినుంచే ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు, వయోవృద్ధులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. జిల్లాలో చెంచులు 6,376 మంది ఉండగా 3,998 మందికే ఓటు ఉందని వీరందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్య పరచనున్నట్లు తెలిపారు. జిల్లాలో 1926 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, వీటిలో ఓటర్లకు అవసరమైన వసతులు కల్పించామన్నారు. జిల్లాకు అవసరమైన ఈవీఎంలు సిద్ధంగా ఉన్నాయని, రాజకీయ పార్టీల సమక్షంలోనే వాటిని తనిఖీ చేశామన్నారు. పోలింగ్ బూత్‌లకు అవసరమైన 144 శాతం ఈవీఎంలను సిద్ధం చేసినట్లు చెప్పారు.

సంక్రాంతి వసూళ్లు

- ఎంట్రీ పాసు పేరిట టిక్కెట్ల అమ్మకం
- స్థాయిని బట్టి అధికారులకు అమ్మకం లక్ష్యాలు
- ప్రజలకు బలవంతంగా అంట గడుతున్న వైనం
- పాసుకు రూ.100 మినహాయించి లబ్ధిదారులకు పింఛన్



వైఎస్ఆర్ సంక్రాంతి సంబరాల ఎంట్రీ పాస్ లక్కీడీప్

సత్తెనపల్లి, జనవరి 11: సంక్రాంతి పల్లె పట్టణాల్లో సందడి.. చిన్నా పెద్దలకు సంబరం.. అయితే వైసీపీ నేతలకు మాత్రం జేబులు నింపుకునేందుకు సంక్రాంతి చేసుకుంటున్నారు. వైఎస్ఆర్ సంక్రాంతి సంబరాల పేరుతో కార్యక్రమాలు రూపొందించి ఎంట్రీ పాసు(లక్కీడీప్)లను విక్రయిస్తున్నారు. రూ.100 ధర నిర్ణయించి వాటిని విక్రయించే బాధ్యత విభాగాల వారీగా పోలీసులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు తదితరులు స్థాయిని బట్టి లక్ష్యాలు విధించి మరీ అధికార పార్టీ నాయకులు అమ్మకాలు చేపట్టారు. లాటరీలు, లక్కీడీప్‌లు నిర్వహించడం నేరమైనా మంత్రి అంబటి ఆధ్వర్యంలో ఇవి జరుగుతుండటంతో అధికారులు, ప్రజాప్రతినిధులు తమవద్దకు వచ్చిన వారికి బలవంతంగా అంటగడుతున్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సంక్రాంతి సంబరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రజాప్రతినిధి కాకపోయినా సత్తెనపల్లి మండలంలో పార్టీ పదవిని అడ్డుపెట్టుకుని పెత్తనం చేస్తున్న ఓ నాయకుడు మంత్రి పేరుచెప్పి ప్రభుత్వాధికారులకు లాటరీ టికెట్లు అమ్మే బాధ్యతను బలవంతంగా అంటగట్టారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఎంట్రీ పాసు పుస్తకాలను తీసుకున్న వారు ప్రజలకు రూ.100 చొప్పున వాటిని బలవంతంగా అంట గడుతున్నారు. పింఛన్ లబ్ధిదారులకు వలంటీర్లు పాసును అంటగట్టి పింఛన్‌లో రూ.వంద మినహాయిస్తున్నారు. సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని నియోజకవర్గ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లతో సమావేశాలు నిర్వహించి ఎంట్రీ పాసు పుస్తకాలను అంటగట్టారని సమాచారం. ఓ కాంట్రాక్టర్‌కు రూ.50 వేల ఎంట్రీ పాసులను కేటాయించటంతో ఆయన వాటిని విక్రయించలేక తన సొంత నిధులను చెల్లించారని సమాచారం. సంక్రాంతి సంబరాలు జరుపుకోవాలంటే ప్రభుత్వం తరఫున జరుపుకోవాలే గాని ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించే సుగాలీకాలనీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఐదారు వేలకు మించి పట్టరు. అయితే వేలాది ఎంట్రీ పాసులను విక్రయిస్తున్నారు. లాటరీల అమ్మకంపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు సైతం వాటిని కొనమని ప్రజలను బలవంతపెడుతున్నారు. ముప్పాళ్ళ పోలీసు స్టేషన్‌కు కూడా 250(5 బుక్కులు) లాటరీ టికెట్లు అమ్మి డబ్బులు పంపాలని పంపించారు. ఒక లాటరీ బుక్కులో 50 లాటరీ టిక్కెట్లు ఉంటాయి. ఒక్కో లాటరీ రూ.100 చొప్పున అమ్మాలి. తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాలకు కూడా టిక్కెట్లు అమ్మే బాధ్యత అప్పగించారని సమాచారం. కొన్ని శాఖల అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో ముందుగానే నగదు చెల్లించి టికెట్ల పుస్తకాలు తీసుకెళ్లారని తెలిసింది.

గత ఏడాది జనసేన కేసులు

గత ఏడాది మంత్రి అంబటి నాయకత్వంలో సంక్రాంతి సంబరాలు పేరిట లక్కీ డ్రా కూపన్లు విక్రయించడంపై జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోర్టులో కేసు దాఖలు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు సత్తెనపల్లిలో అంబటి రాంబాబుపై కేసు కూడా నమోదైంది. అయినా ఈ ఏడాది మంత్రి అంబటి వైఎస్ఆర్ సంక్రాంతి సంబరాల పేరిట ఎంట్రీ పాసుల విక్రయానికి తెర లేపారు.



సంక్రాంతి సంబరాల సందర్భంగా ప్రకటించిన బహుమతులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ విజయవాడలో గురువారం నిర్వహించిన ముగ్గుల పోటీలో అద్దేపల్లి సునీత(సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల) ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున పాల్గొని రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించింది.

కాగితాలపై తప్ప అభివృద్ధి శూన్యం

- బొల్లా, ఆయన సతీమణికి రెండు చోట్ల ఓట్లు
- దొంగ ఓట్లపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 11: కాగితాలపై కాకి లెక్కలు తప్ప అభివృద్ధి శూన్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. వినుకొండలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ వారిచ్చిన డబ్బులు తీసుకుని ఓటుతో బొల్లాకు బుద్ధి చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలు 167 సీట్లుతో సంయుక్త ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దోపిడీ ఎమ్మెల్యేలను ఎక్కడికి మార్చినా వారు గెలవరన్నారు. రాష్ట్రంలో కొందరు ఎమ్మెల్యేలు చివరికి మట్టిని కూడా వదలలేదని, రేషన్, గ్రానైట్, లిక్కర్, రియల్‌ఎస్టేట్ కమీషన్, దందాలతో ఎమ్మెల్యేలు కోట్లకు పడగలెత్తారన్నారు. కనీసం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. భూమి హక్కుపై చట్టం తీసుకురావడం దుర్మార్గమన్నారు. మద్యం షాపులను తాకట్టు పెట్టిన ఘనుడు భూమి హక్కు చట్టం ద్వారా ఆస్తులను తాకట్టు పెట్టి ముంచుతారని ప్రజలు గమనించాలన్నారు. రానున్న ఎన్నికల్లో పల్నాడు జిల్లాలో ఒక్క సీటు కూడా గెలవరని, ఏడుకు ఏడు సీట్లు టీడీపీ గెలవబోతుందని జీవీ ఛాలెంజ్ చేశారు.



బొల్లాకు ఉన్న డబుల్ ఓటుపై ఆధారాలు చూపుతున్న జీవీ

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఆయన సతీమణికి వినుకొండ, నరసరావుపేటల్లో ఓటు హక్కు కలిగి ఉన్నారన్నారు. దొంగ ఓట్లతో గెలిచేందుకు ఇప్పటికే డబుల్ ఎంట్రీల పేరుతో 24వేలకు పైగా నమోదు చేయించుకున్నారని, వాటికి సంబంధించి ఆధారాలతో అధికారులకు అప్పగించినా చర్యలు శూన్యమన్నారు. ఈ విషయంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీఎల్‌డీపీ చైర్మన్ లగడపాటి వెంకట్రావు, మీసాల మురళీకృష్ణ, ఆయూబ్‌ఖాన్, రాపర్ల జగ్గారావు, దాసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉదయ్.. వచ్చేస్తోంది

- రైలు ప్రారంభానికి కుదరిన ముహూర్తం
- నేడు గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్రారంభోత్సవం
- నరసపూర్ - హుబ్లీ అమరావతి ఎక్స్‌ప్రెస్‌కూ పచ్చజెండా

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఏడాది నుంచి ఎప్పుడా.. ఎప్పుడా అని ఎదురుచూస్తోన్న ఉదయ్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవానికి ముహూర్తం కుదిరింది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గుంటూరు పర్యటన ఖరారు కావడంతో విశాఖపట్టణం - విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ గుంటూరు వరకు పొడిగింపు ప్రారంభోత్సవ ముహూర్తాన్ని రైల్వే శాఖ ఖాయం చేసింది. ఏడాదిగా ఈ రైలు గుంటూరు ప్రయాణికులను ఊరిస్తూ ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తోండగా ఎట్టకేలకు శుక్రవారం గుంటూరు రైల్వేస్టేషన్‌లో కూత పెట్టనుంది. మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ రైలుకు జెండా ఊపి ప్రారంభించనున్నారు. నెంబరు.22701 విశాఖ - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ వారంలో ఆది, గురువారాలు మినహా మిగతా ఐదు రోజులు సర్వీసు ఉంటుంది. ఈ రైలు వేకువజామున 5.20కి విశాఖలో బయలుదేరి దువ్వాడ, అనకాపల్లి, తుని, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ మీదగా మధ్యాహ్నం 1 గంటకు గుంటూరు చేరుకుంటుంది. నెంబరు.22702 గుంటూరు - విశాఖ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4 గంటలకు బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా ప్రయాణించి రాత్రి 10.55కి విశాఖ చేరుకుంటుంది. ఈ రైలులో ఏసీ చైర్‌కార్, సెకండ్ సిట్టింగ్ బోగీలున్నాయని డీఆర్‌ఎం ఎం రామకృష్ణ తెలిపారు.

మరో రెండు రైళ్లకు కూడా..

ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌తో పాటుగా మరో రెండు రైళ్లకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వీడియో లింకు ద్వారా జెండా ఊపి ప్రారంభించనున్నారు. ప్రస్తుతం విజయవాడ - హుబ్లీ మధ్య గుంటూరు మీదగా రాకపోకలు సాగిస్తున్న అమరావతి ఎక్స్‌ప్రెస్‌ని నరసపూర్ వరకు పొడిగించారు. నెంబరు.17225 నరసపూర్ - హుబ్లీ అమరావతి ఎక్స్‌ప్రెస్ శుక్రవారం నుంచి నిత్యం సాయంత్రం 4.10కి బయలుదేరి పాలకొల్లు, భీమవరం జంక్షన్, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ మీదగా విజయవాడకు చేరుకుని అక్కడి నుంచి ప్రస్తుతం ప్రయాణిస్తున్న సమయపట్టికలోనే గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 11.20కి హుబ్లీ చేరుకుంటుంది. నెంబరు.17226 హుబ్లీ - నరసపూర్ రైలు నిత్యం మధ్యాహ్నం 1.20కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2.25కి గుంటూరు, 3.40కి విజయవాడ, మరుసటి రోజు ఉదయం 7.40కి నరసపూర్ చేరుకుంటుంది. ఈ రెండు రైళ్లతో పాటు నంద్యాల-కడప రైలుని రేణిగుంట వరకు పొడిగించనున్నారు. ఈ పొడిగింపులతో గుంటూరుకు కొత్తగా ఉదయ్ ఏసీ ఎక్స్‌ప్రెస్ రైలు సదుపాయం అందుబాటులోకి వస్తుంది.



గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఉదయ్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవానికి చేసిన ఏర్పాట్లు

కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు



హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు

కెనరా బ్యాంక్ केनरा बैंक Canara Bank A Government of India Undertaking Together We Can
ఆంధ్రజ్యోతి ABN
AIMS INSTITUTES Peenya, Bangalore +91 81500 01994 www.theims.ac.in/apply
SWARGASEEMA SUKETANA Ph: + 91 98490 12500



విజేతలు వీరే.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

SRI MITTAPALLI TRUST
SRI MITTAPALLI PHARMACY COLLEGE
(Sri Mittapalli Engineering College Campus)
Tummalapalem, GNT-CPT Road, NH=16, Guntur-522019
Ph. 9000447117
WALK – IN–INTERVIEW
for the following posts will be conducted at the college campus on 17-01-2024
1.Principal, 2. Asso. Professors, 3. Asst.Professor 4. Lab Technicians, 5.Office Staff and Attenders.
Interested and Qualified persons can contact the office at the above address with all certificates and testimonials.
Departments : Pharmaceutics, Pharma, Chemistry, Pharma Analysis, Pharmacology & Pharmacognosy.
Experience and salary will be as per the PCI norms.
Date:11-01-2024
CHAIRMAN, Sri Mittapalli Trust

మిర్చియార్డులో హమాలీల ఆందోళన

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మిర్చియార్డులో హమాలీలు మెరుపు ఆందోళనకు దిగారు. గురువారం మధ్యాహ్నం రైతులు తమకు ఇచ్చిన మచ్చుకాయలను బయటకు తీసుకెళుతుంటే 60 ఏళ్ల వయస్సు పైబడిన ముఠా కార్మికుడిపై ఇద్దరు మహిళా సెక్యూరిటీ సిబ్బంది భౌతికంగా దాడి చేసి లాక్కొన్నారని ఆరోపిస్తూ గుంటూరు - హైదరాబాద్ జాతీయ రహదారిని గంటకు పైగా దిగ్బంధించారు. ఈ సందర్భంగా యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైసీపీ నేతలపై తిట్ల దండకం అందుకొని యార్డు పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రదర్శనగా వచ్చి యార్డు పరిపాలన భవనం వద్ద ఆందోళనకు దిగారు. ఈక్రమంలో వీరికి కొంతమంది అసాంఘిక శక్తులు జత కలిసి అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది, అటెండర్లపై చేయి చేసుకొన్నారు. మార్కెటింగ్ అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న ఆఫీసుల వద్దకు వెళ్లి తలుపులపై చేతులతో బాదుతూ లోనికి చొచ్చుకొని వెళ్లే ప్రయత్నం చేశారు. అదే సమయంలో పోలీసులు అక్కడికి వచ్చి వారిని వారించి బయటకు పంపేశారు. అనంతరం మార్కెటింగ్ విజయవాడ రీజియన్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు వద్ద ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు చర్చలు జరిపారు. యార్డులో ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది తమని దొంగల్లా చూస్తున్నారని, షాపులలోకి వచ్చి అన్ని శోధిస్తున్నారని, నానా దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు. దీనిపై జేడీ శ్రీనివాసరావు స్పందిస్తూ యార్డు అనేది రైతుల శ్రేయస్సు కోసం ఏర్పాటు చేసింది. ఇక్కడ రైతుకు నష్టం జరగడానికి వీలులేదు. మచ్చుకాయలు ఎవరూ తీసుకొన్నా చట్టరీత్యా నేరం. కావాలంటే మచ్చు కూలీ పెంచమని కోరితే చర్చలు జరిపి నిర్ణయం తీసుకొంటాం. అంతే తప్పా ఇలా ఆఫీసులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది ఎవరైనా అమానుషంగా ప్రవర్తిస్తే వారిపై చర్యలు తీసుకొంటామన్నారు.

ఉద్యోగ ఉపాధికి నిలయం అమరావతి

1486 వ రోజుకు చేరుకున్న ఆందోళనలు

తుళ్లూరు జనవరి 11: రాష్ట్ర యువతకు ఉద్యోగ , ఉపాధి నిలయంగా అమరావతి రాజధాని ఉండేది మూడు ముక్కల ఆటతో అందరికి నిరాశే మిగిల్చారని , 33వేల ఎకరాలు రాజధాని నిర్మాణానికిచ్చిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు,నిరసనలు దీక్షలు గురువారం నాటికి 1486వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ , ఆంధ్ర రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతేనని ఒక్క అంగుళం కూడా కదల్చలేరని అన్నారు. ఐదు కోట్ల మంది అంగీకరించిన రాజధాని అమరావతి అని స్పష్టం చేశారు. పాలకుల సొంత ప్రయోజనాల కోసం ఆడుతున్న మూడు ముక్కల ఆటకు ప్రజలు వ్యతిరేకమన్నారు. తాము చేసిన పాద యాత్రలకు వచ్చిన స్పందనతో అమరావతిపై ప్రజలకు ఎంత అభిమానం , ఆప్యాయత ఉందో సీఎం జగన్‌రెడ్డి తెలుసుకోవాలన్నారు. అమరావతిని అభివృద్ధి చేయకుండా నాశనం చేయటానికే ఎక్కువ సమయం పాలకులు కేటాయించటం దుర్మార్గమన్నారు. ఉన్నత న్యాయస్థానం తీర్పును అనుసరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సంపద అమరావతిని నాశనం చేయవద్దన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో రైతుల ఆందోళనలు కొనసాగాయి.



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు ,రైతులు

జడ్పీ స్టాండింగ్ కౌన్సిల్ గా 'వేముల'

గుంటూరు సిటీ, జనవరి 11:గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ స్టాండింగ్ కౌన్సిల్ గా ప్రముఖ న్యాయవాది వేముల జయపాల్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆయనకు నియామకపు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, అడ్వకేట్ ప్యానెల్ ప్రతిపాదించిన న్యాయ వాదుల నుండి ఒకరిని స్టాండింగ్ కౌన్సిల్ గా ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ సంబంధించిన కేసులు అన్నింటిని సమర్ధవంతముగా వాదించి విజయాన్ని సాధించాలని జడ్పీ చైర్ పర్సన్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



జయపాల్‌కు నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

13 నుంచి 16 వరకు మిర్చియార్డుకు సెలవులు

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రెండో శనివారం, సంక్రాంతి పండగ దృష్ట్యా ఈ నెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మిర్చియార్డుకు సెలవులు ప్రకటించినట్లు మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈ నెల 17వ తేదీన బుధవారం యార్డులో లావాదేవీలు పునఃప్రారంభమౌతఆయని చెప్పారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని సూచించారు.

విద్యుత్‌విజిలెన్స్ బృందాల తనిఖీలు

- 261 మందికి రూ. 14.09 లక్షల అపరాధ రుసుం

గుంటూరు, జనవరి 11: విద్యుత్ విజిలెన్స్ , ఆపరేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈఈ (డీపీఈ) కె సూర్యప్రకాష్ , గుంటూరుటౌన్-1 డివిజన్ ఆపరేషన్‌ఈఈ టి శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. 56 మంది అధికారులు, 168 మంది సిబ్బంది, 56 బృందాలుగా ఏర్పడి పెదకాకాని, వెనిగండ్ల, అగర్తవరపాడు, నంబూరు, ఐజెఎమ్ , ఉప్పలపాడు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు డీపీఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3837 సర్వీసులు తనిఖీ చేసి అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 261 మందికి రూ. 14.09 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ చౌర్యం నేరమని, చౌర్యానికి పాల్పడే వారిపై 9440812263, 9440812360కు ఫిర్యాదులు చేయాలని కోరారు.

14న గుంటూరు మీదగా నరసపూర్ - హైదరాబాద్ రైలు

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14వ తేదీన గుంటూరు మీదగా నరసపూర్ - హైదరాబాద్ ప్రత్యేక రైలుని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు 07177 నరసపూర్ - హైదరాబాద్ రైలు ఆదివారం సాయంత్రం 6 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు వేకువజామున 4.50కి హైదరాబాద్ చేరుకుంటుందన్నారు.

ఆరు రైళ్లకు అదనపు బోగీలు

ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా శబరి, రాయగడ, తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లకు రెండు వైపులా అదనపు బోగీలు జోడిస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. శబరి ఎక్స్‌ప్రెస్‌కి ఒక ఏసీ త్రీటైర్, రాయగ ఎక్స్‌ప్రెస్‌కి ఒక జనరల్ సిట్టింగ్, తిరుపతి ఎక్స్‌ప్రెస్‌కి మూడు జనరల్ సిట్టింగ్ భోగీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

ఉద్యోగావకాశాలు

- Wanted Sales executives for NEXA Car showroom in Guntur. Experience/ Fresher Sales can apply. Cont:9100787054 AAA-8623
- డిటిపి ఆపరేటర్ కావలెను. పేజ్ మేకర్ తెలిసి ఉండవలెను. తెలుగు టైప్ చేయుట రావలెను. అనుభవం అనుసరించి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర. యస్. బాలచందర్, సర్వేయర్స్ అసోషియేషన్ బిల్డింగ్, డి.టి.డి.సి. ప్రక్కన, ఆర్.డి.ఓ. ఆఫీస్ రోడ్, గుంటూరు: 9848968889. AJG-166980
- కావలెను : గుంటూరు, నల్లపాడు రోడ్డులో గల శ్రీనాగసాయి మందిర్‌లో స్వామి వారికి అర్చనాది కైంకర్యములు చేయుటకు అర్చకులు కావలెను. స్వామి వారికి మహానైవేద్యము, ప్రసాదము వండుటకు వంట మనిషి (బ్రాహ్మణులు) కావలెను. వసతి మరియు మంచి జీతము ఇవ్వబడును. వ్యక్తిగతముగా సంప్రదించవలెను. యస్. బాలచందర్, సర్వేయర్స్ అసోషియేషన్ బిల్డింగ్, డి.టి.డి.సి. ప్రక్కన, ఆర్.డి.ఓ. ఆఫీస్ రోడ్, గుంటూరు: 98489 68889. AJG-166979
- గుంటూరులోని ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీలో ఆఫీసు మరియు సిస్టమ్ వర్క్ చేయుటకు ఇంటర్ ఉత్తీర్ణత కలిగిన వివాహిత మహిళలు కావలెను. సెల్: 90309 93895 AJB-1290

బిజినెస్ ఆఫర్

- TRADING SECTOR లో పెట్టుబడి పెట్టండి, వారం వారం మంచి ఆదాయం పొందండి లేదా ట్రేడింగ్ నేర్చుకోండి. మంచి ఆదాయం సంపాదించుకోండి. ఫోన్ : 9398072799. SAAA-677

అమ్మకం

- గుంటూరు కంపెనీ అమ్మకం: ఇడ్లీరవ్వ, రాగిపిండి, బియ్యపుపిండి మెషినరీతోపాటు రన్నింగ్‌లో ఉన్న పరిశ్రమ అమ్మకమునకు కలదు. వివరములకు సంప్రదించండి. సెల్: 99 666 53 787 AJB-258

CHANGE OF NAME

- I. GRANDHI NAGA SAI VIJAYA LAKSHMI (Old Name), W/o. GRANDHI RADHA KRISHNA MURTHY resident of D.No.5-75-26, 3rd Lane, Pandaripuram, Guntur 522002 (A.P). I have changed my name as GRANDHI NAGA SAI VIJAYA LAKKSHMI (New Name), W/o. GRANDHI RADHA KRISHNA MURTHY. here after my name is known as GRANDHI NAGA SAI VIJAYA LAKKSHMI (New Name), W/o. GRANDHI RADHA KRISHNA MURTHY AJG-184032
- I, GRANDHI RADHA KRISHNA MOORTHY (Old Name), S/o. SESHAVATHARAM, resident of D.No.5-75-26, 3rd Lane, Pandaripuram, Guntur - 522002 (A.P). I have changed my name as GRANDHI RADHA KRISHNA MURTHY (New Name) S/o. SESHAVATHARAM. here after my name is known as GRANDHI RADHA KRISHNA MURTHY (New Name) S/o. SESHAVATHARAM. AJG-184033

PLOT FOR SALE

- గోరంట్ల పంచాయితీ ఆఫీసు ఎదురు లైను ఇళ్ళ మధ్య 450 చ.గ.స్థలం మొత్తంగా గాని , విడివిడిగా గాని అమ్మకమునకు కలదు. సంప్ర॥ 9392589423. AAA-8442
- గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని గోరంట్ల నందు అమరావతిరోడ్డుకి దగ్గరగా అపార్ట్‌మెంట్స్ దగ్గరలో 632 చ.గ. స్థలం. విడివిడిగా గాని, మొత్తంగా గాని డెవలప్‌మెంటుకుగాని, అమ్మకమునకు గాని కలదు. 200 చ.గ. ఉడా అప్రూవల్ కలిగిన ప్లాట్లు బ్యాంకు లోను సౌకర్యంతో అమ్మకమునకు కలవు. సంక్రాంతి సందర్భంగా రిజిస్ట్రేషను ఫ్రీ. సంప్ర॥9515714607 AAA-8441

గోల్డ్ ఫైనాన్స్

- బంగారం బ్యాంకులలో, ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. క్యారెట్‌ను బట్టి రేటు. స్పాట్ క్యాష్ సెల్: 77801 13535 AJB-181855

బంగారం కొనబడును

- బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999 AJB-181857

పోయినవి

- ముప్పా అరుణ W/o Peddireddy, D.No:31-13-1, సుల్తానాబాద్, తెనాలి, Gnt dt, a.p నా యొక్క స్థలం డాక్యుమెంట్ నెంబర్ 770/2004. (S.R.o, tenali) తెనాలి అంగలకుదురు నుండి సుల్తానాబాద్‌కి టూవీలర్‌పై వెళ్తుండగా నా యొక్క ఒరిజినల్ స్థలం డాక్యుమెంట్ పోయినది. కావున ఎవరికైనా దొరికినచో ఈ నెంబర్ 7675889088 కు తెలుపగలరు. AJG-184079

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు 99854 03281 సమయం : ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 06:00 గం॥ల వరకు (సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

గుంటూరు :సరస్వతిథియేటర్
గుంటూరు :హరిహరమహల్
గుంటూరు :నాజ్‌అప్సరథియేటర్
గుంటూరు :వి.ప్లాటినో
గుంటూరు :ది సినిమాస్
గుంటూరు :జెఎల్ఇసినిమాస్
తెనాలి :మినిసంగమేశ్వర
తెనాలి :పెమ్మసానిథియేటర్
ఒంగోలు :గోరంట్లసినిమాస్
ఒంగోలు :రవిప్రియమహల్
చీరాల :సురేష్‌మహల్
నరసరావుపేట: లక్ష్మీనరిసింహ
చిలకలూరిపేట :విజయభాస్కర్
మంగళగిరి :అన్నపూర్ణ
రేపల్లె :రాజ్యలక్ష్మీ
పొన్నూరు :శ్రీలక్ష్మి
బాపట్ల :విజయకృష్ణ
పిడుగురాళ్ళ :జయలక్ష్మీ
సత్తెనపల్లి :ఈశ్వరసాయి
మాచర్ల :వెంకటేశ్వర
వినుకొండ :సురేష్‌మహల్
అద్దంకి :VNS
టంగుటూరు :వెంకటేశ్వర
చీమకుర్తి :కె3కెస్క్రీన్స్
రేపే విడుదల



పల్నాడు వార్తలు

మాచర్ల • గురజాల • సత్తెనపల్లి • పెదకూరపాడు



టీడీపీ మ్యానిఫెస్టోను వివరిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు

భవిష్యత్తులో జగన్ ముఖ్యమంత్రి కాలేడు

● బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారంటీలో యరపతినేని

గురజాలటౌన్, జనవరి 11 : రాష్ట్రానికి భవిష్యత్తులో వైఎస్ జగన్ఇక ముఖ్యమంత్రి కాలేడని, ఇదే చివరి అవకాశమని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. పట్టణంలోని 15, 16 వార్డులలో గురువారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నరరూప రాక్షసుడు జగన్ను గద్దె దింపాలని పిలుపు నిచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి అమలు చేయనున్న సంక్షేమ సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి వివరించారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో గురజాల నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. సంక్రాంతి పండుగ తరువాత చంద్రబాబు, పవన్కల్యాణ్ ఆధ్వర్యంలో మరో మేనిఫెస్టో విడుదల కాబోతుందన్నారు. అంతే కాకుండా గురజాల నియోజకవర్గంలో కూడా ప్రత్యేక మేనిమేస్టో ఉంటుందన్నారు. రాష్ట్రంలో 155 సీట్లతో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధిని వదలిపెట్టి ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడం పనిగా పెట్టుకున్నారని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటన్నింటిని బయటకు తీస్తామని చెప్పారు. ముందుగా పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. యరపతినేనికి టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

5వ వార్డులో భవిష్యత్తుకు గ్యారంటీ

పిడుగురాళ్ల, జనవరి 11: స్థానిక 5వ వార్డులో బుధ, గురువారాలలో బాబు ష్యూరిటీ - భవిష్యత్కు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. పట్టణ తెలుగు మహిళ అధ్యక్షురాలు చల్లగుండ్ల సీత, 5వ వార్డు ఇన్చార్జ్ కందిమళ్ల శ్రీను, పమిడి శ్రీనివాసరావు, రాయపాటి రాజు, ఖాశింసైదా, గడిపూడి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని చంద్రబాబు మేనిఫెస్టోను వివరిస్తూ టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికి జరుగబోయే లబ్ధి గురించి తెలియజేస్తూ గ్యారంటీ కార్డులను అందజేశారు.

ప్రజల్లో మార్పు కనిపిస్తోంది : యరపతినేని

పిడుగురాళ్ల, జనవరి 11: ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, పవన్కల్యాణ్ రాష్ట్రంలో ప్రధాన ప్రాంతాల్లో రా....కదలిరా....! సభలకు అశేష జనవాహిని తరలివచ్చి విజయవంతం అయ్యాయంటే ఏపీ ప్రజల్లో వచ్చిన మార్పేనని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావేదిక కూల్చివేతతో మొదలై రుషికొండను బోడుగుండు చేసేదాకా జగన్ నిద్రించలేదని, స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తూ అధికారాన్ని అడ్డుపెట్టుకొని టీడీపీ నేతలపై అక్రమ కేసులు, నిత్యావసర సరుకుల ధరల పెంపుతో ప్రజలలో వైసీపీ ప్రభుత్వం వ్యతిరేకత మూటకట్టుకుందన్నారు. 2014-2019 మధ్యకాలంలో గురజాల నియోజకవర్గంలో 2,265 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని, గురజాల ఆర్డిఓ భవనం, పంచాయతీరాజ్ గెస్ట్హౌస్, సిసి రోడ్లు, కమ్యూనిటీ హాల్స్, ఆసుపత్రి భవనాలు, పుష్కరాల సమయంలో అనేక పుష్కరఘాట్లతో పాటు ప్రతి గ్రామంలోనూ సిమెంట్ రోడ్లు వేసిన ఘనత తమదేనని యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

పిడుగురాళ్ల, జనవరి 11: అయ్యప్పనగర్లో ఇటీవల అనారోగ్య కారణంతో మృతి చెందిన కామేపల్లి, బోధనం మాజీ సర్పంచ్ తిరుమలకురవు రామయ్య కుటుంబాన్ని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం రాత్రి పరామర్శించారు. కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని భరోసా కల్పిస్తూ రూ.20 వేలను రామయ్య కుటుంబసభ్యులకు అందించి రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యరపతినేని సాయినిఖిల్, గండికోట వెంకటేశ్వర్లు, పోట్ల బ్రహ్మం, పాండురంగ శ్రీను, మేకల రాంబాబు, నరసింహారెడ్డి, స్థానిక నేతలు తదితరులున్నారు.

ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్

పిడుగురాళ్ల, జనవరి 11 : పిడుగురాళ్ల మండలంలో గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్ పూర్తయి గురువారం ప్రజావేదిక సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మొత్తం 4 కోట్ల 50 లక్షల 77 వేల రూపాయల పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ సభ్యులు ప్రతి గ్రామంలో ప్రత్యక్ష ఆడిట్ నిర్వహించారు. మస్టర్లు సంతకాలు పొరపాట్లు, పంట కాల్వల పనుల్లో కొంత రికవరీ, జాబ్ కార్డులు వున్న వారికి పనులు కల్పించడం లేదని మరికొందరు సోషల్ ఆడిట్ బృందం సభ్యుల దృష్టికి వచ్చిన పలు అంశాలను ప్రజావేదికకు హాజరైన జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ గంగవరపు జోసఫ్కుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం లక్షా 31 వేల 154 రూపాయలు రికవరీ రాగా, 15 వేల రూపాయలు పెనాల్టీగా గుర్తించారు. ఒక్కొక్క గ్రామంలో జరిగిన పనులలో లోపాలను గుర్తించి రూ.2 వేల లోపు రికవరీగా ఆదేశాలు ఇవ్వగా చినఅగ్రహారం గ్రామంలోనే రూ.55 వేలు రికవరీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశయ్య, ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి, ముడేల వెంకటేశ్వరరెడ్డి, ఎపిడి సురేంద్ర, ఎపిఓ మేరి గ్రేస్, ఇసి బుచ్చిబాబు హాజరయ్యారు.

బీసీలను ఉక్కుపాదంతో అణచివేస్తున్నారు : గుంటుపల్లి

దాచేపల్లి, జనవరి 11 : వైసీపీ పాలనలో రాష్ట్రంలో బీసీలపై ఉక్కుపాదంతో అణచివేయడం జరుగుతుందని జాతీయ క్రమశిక్షణా కమిటీ సభ్యులు గుంటుపల్లి నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. దాచేపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీ నాయకులందరూ పార్టీలకు అతీతంగా ఛలో రాజమండ్రి పిలుపు ఇవ్వగా వారందరిని నిర్బంధించడం జరిగిందని తెలిపారు. టీడీపీ మాజీ మంత్రి, బీసీ ఫెడరేషన్ కన్వీనర్ కొల్లు రవీంద్రను నిర్బంధంలోకి తీసుకొని 24 గంటలపాటు వేధించారని ఆరోపించారు. జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం బీసీలపై దాడిచేస్తూ భయాందోళనకు గురిచేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో పోలీసు అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారని, వైసీపీ అక్రమాలకు పోలీసులు మద్దతు ఇవ్వడం సరికాదన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి : డీఎస్పీ

పిడుగురాళ్ల, జనవరి 11 : గురజాల సబ్ డివిజన్ పరిధిలో 2024 సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు అధికారులు ఇప్పటి నుండే తగిన ప్రణాళికతో ఉండాలని గురజాల డీఎస్పీ పళ్లంరాజు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని గ్రామాలలో 1700 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేయగా, 1200 మందిపై బైండోవర్, 496 రౌడీషీటర్లు, 180 మంది అనుమా నాస్పద వ్యక్తులను గుర్తించడం జరిగిందని, పాతకేసుల్లో ముద్దాయిలతో పాటు నేరచరిత్ర కలిగిన వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలని డీఎస్పీ ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంతంగా ఎటువంటి గొడవలు లేకుండా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఎస్పీ రవిశంకర్రెడ్డి ఆదేశాల మేరకు ఇప్పటి నుండే ప్రతి గ్రామంలో పోలీసులు మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ ఎలక్షన్-2024 గురించి ప్రజలకు వివరించాలని డీఎస్పీ తెలిపారు.

సెబ్ అధికారుల దాడులు

గురజాలటౌన్, జనవరి 11: దాచేపల్లి మండలం నడికుడి చర్చి వద్ద బడ్డీ దుకాణంలో సెబ్ అధికారులు గురువారం దాడులు జరిపారు. అక్రమంగా ఉంచిన 56 అక్రమ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దాచేపల్లిలోని ఓ షాపులో తెలంగాణ మద్యం విక్రయిస్తుండగా ఆ షాపును కూడా తనిఖీ చేసి ఓ బాటిల్ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

నకిలీ ఇంజన్ ఆయిల్ స్వాధీనం

మాచర్ల, జనవరి 11 : పట్టణంలోని ఓ ఆటో మొబైల్ షాపులో గురువారం పట్టణ పోలీసులు తనిఖీ నిర్వహించారు. 600 లీటర్ల క్యాస్ట్రోల్ నకిలీ ఇంజన్ ఆయిల్ ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

వెల్దుర్తి, జనవరి 11: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రచ్చమలపాడు అడ్డరోడ్డు వద్ద గురువారం జరిగింది. గుండ్లపాడు గ్రామానికి చెందిన జవిశెట్టి కోటయ్య (40) ఉదయం ద్విచక్ర వాహనంపై మాచర్లకి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతూ రచ్చమలపాడు అడ్డరోడ్డు వద్ద తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. నిర్జీవ స్థితిలో ఉన్న కోటయ్యను స్థానికులు గమనించి గుండ్లపాడు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యులు వచ్చి చూసేసరికి అప్పటికే చనిపోయి ఉన్నాడు. పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు.

సైకో ముఖ్యమంత్రిని సాగనంపాలి

● టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ



భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

సత్తెనపల్లి, జనవరి 11 : సైకో ముఖ్యమంత్రిని సాగ నంపాలని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 17వ వార్డులో గురువారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మద్యం అమ్ముకొనే జగన్మోహన్రెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి తిరిగి మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. రాష్ట్రంలో రాక్షస పాలన పోవాలని, తిరిగి తెలుగుదేశం, జనసేన కూటమి అధికారంలోకి రావాలని కోరుతూ మహిళలు కన్నా లక్ష్మీనారాయణకు హారతులు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. పలువురు మహిళలు కన్నా లక్ష్మీనారాయణను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, నాయకులు ఆతుకూరి నాగేశ్వరరావు, బందారు నాగరాజు, నూర్ బాషా జానీ బాబు, ఆరేపల్లి ఏడుకొండలు, సంగెపు వెంకటరావు, మాగులూరి భాను ప్రకాష్, ఎం.అప్పారావు, బీ.సంగీతరావు, రాంబో బుడే, సీతయ్య, అన్నదాసు శ్రీనివాసరావు, జంగాల శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు

రాజుపాలెం, జనవరి 11 : రాజుపాలెం మండలంలో అధికార వైసీపీ వీడి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలోకి వలసలు పెరిగిపోయాయి. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో అధికార వైసీపీ నుంచి సుమారు 30 ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. వారికి టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామంలో నిర్వ హించిన గాదం పెద్ద బాలయ్య పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి పూజల వెంకట కోటయ్య, మండలాభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ నర్రా బాబురావు, నాయకులు సులగా వెంకట అప్పారావు, మాజీ సర్పంచ్లు దుడ్డు అప్పారావు, యామర్తి శ్రీను, వాసా వెంకటేశ్వర్లు, పార్లమెంటు కమిటీ సభ్యులు అంకాళ్ల ప్రభుదాసు, బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి బ్రహ్మయ్య, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పగడాల శ్రీను, చోక్కా శ్రీను, షేక్ అల్లాబక్షు, గ్రామ పార్టీ అధ్యక్షుడు తమటం వీరయ్య, ఇర్ల కోటేశ్వరరావు, దంతాల శ్రీను, వెంకట్రావు, వెంకట్రామయ్య, జి.పరమేశ్వరరావు, తొర్లికొండ మల్లేశ్వరరావు, చొక్కా వెంకటప్పయ్య, ఎస్.అంకమ్మరావు, జనసేన పార్టీ నాయకులు పి.వెంకటస్వామి ఉన్నారు.

సత్తెనపల్లి, జనవరి 11 : పట్టణంలోని 23వ వార్డుకు చెందిన వైసీపీ నేత ఆలివేలు కృష్ణ గురువారం కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయనకు కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చంద్రబాబుకు కన్నా కృతజ్ఞతలు

సత్తెనపల్లి, జనవరి 11 : సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ఎంపిక చేసినందుకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్కు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులుకు టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ గురువారం కృతజ్ఞతలు తెలిపారు.

కన్నాకు పలువురు అభినందనలు

సత్తెనపల్లి, జనవరి 11 : సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ఎంపికైన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారా యణను గురువారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో పలువురు టీడీపీ నేతలు కలసి అభినందనలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. వారిలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, నాయకులు చౌట శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, కటకం రామకృష్ణ, పల్లపాటి పెద్దిరాజు, ఆళ్ళ అమరేశ్వరరావు, నాదెండ్ల నాగేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరావు, కొనికినేని సత్యనారాయణ, బలిజేపల్లి సురేష్ కుమార్, పోట్ల ఆంజనేయులు, చిలకా శ్యామ్, చింతపల్లి అజయ్ కుమార్ తదితర టీడీపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె

● కేంద్రాలకు నోటీసులు అంటించిన అధికారులు



తాలూకా సెంటర్లో కొనసాగుతున్న అంగన్ వాడీల సమ్మె

సత్తెనపల్లి, జనవరి 11 : అంగన్వాడీల సమ్మెను అణచి వేసే విధంగా ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. డెడ్లైన్ ముగిసినా విధులకు హాజరుకాకపోవటంతో అంగన్వాడీ కార్యకర్తలకు, ఆయాలకు షోకాజ్ నోటీసులు జారీ చేయటాన్ని ఐసీడీఎస్ అధికారులు ప్రారంభించారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు నోటీసులు తీసుకోకపోవటంతో వారి గృహాలకు, కేంద్రాలకు నోటీసులు అంటిస్తున్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని అంగన్వాడీ నాయకులు సుజాత, అహల్య చెప్పారు.

● పిడుగురాళ్ల, జనవరి 11 : గత 33 రోజులుగా సమస్యల పరిష్కారం కోరుతూ చేస్తున్న సమ్మె గురువారం కూడా కొనసాగింది. పిడుగురాళ్ల ఆర్అండ్బి బంగ్లా వద్ద పిడుగురాళ్ల, మాచవరం మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెలో పాల్గొన్నారు. అంగన్వాడీ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందడమే కాకుండా ఎస్మా చట్టాన్ని ప్రయోగించి బెదిరింపులకు పాల్పడటం ఎంతమాత్రం సమంజసం కాదని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తెలగపల్లి శ్రీను, శాంతమణి, హజ్రా, సుజాత, శివరంజని, వెంకటరమణ, కృష్ణాంజలి, కవిత, జయశ్రీ, అరుణ, స్వప్న, శివ, పార్వతి, నఫియాజ్, ఆషా, జయకుమారి, లలిత, రమణ తదితరులు పాల్గొన్నారు.

● ముప్పాళ్ళ జనవరి 11: మండలంలో నెలరోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు నోటీసులు జారీచేయడానికి వెళ్ళిన ఐసీడీఎస్, సచివాలయ అధికారులకు నోటీసులు తాము తీసుకోమని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తెగేసి చెబుతున్నారు. దీంతో చేసేది లేక ఐసీడీఎస్ సూపర్వైజర్లు, సచివాలయం సిబ్బంది అంగన్వాడీ కేంద్రాలకు, కార్యకర్తల గృహాలకు గురువారం నోటీసులు అంటించి వెళుతున్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ఉదయం 9 గంటల నుండి 12 గంటల వర కు సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశాలకు విధులు అప్పగించినా కొన్ని అంగన్వాడీ కేంద్రాల తలుపులు కూడా తీయనివి ఉన్నాయి. నెలరోజులుగా తమపిల్లలకు పౌష్టికాహారం అందడంలేదని ఎస్సీ, ఎస్టీ కాలనీలోని పేదలు వాపోతున్నారు.

● క్రోసూరు, జనవరి 11 : రాష్ట్ర వ్యాప్తంగా అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ చేస్తున్న సమ్మె 31వ రోజుకు చేరినప్పటికీ సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి వెళ్ళకపోవటం విడ్డూరంగా ఉందని క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయలక్ష్మి, శివపార్వతి విమర్శించారు. గురువారం జరిగిన నిరసన దీక్షలో రెండు వందల మంది అంగన్ వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రత్యక్షంగా హామి ఇచ్చినా ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి అంగన్వాడీలతో నేరుగా డిమాండ్ల పై చర్చలు జరపాలని వారు కోరారు.

● అమరావతి, జనవరి 11 : గత 31 రోజులుగా అంగనవాడీ కార్యకర్తలు తమ డిమాండ్ల పరిష్కారం కోసం చేస్తున్న నిరసన దీక్ష గురువారం పొర్లుదండాలతో తమ నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించేదాకా తమ నిరసనలు కొనసాగుతాయని అంగనవాడీ కార్యకర్తలు అన్నారు. అంగన్వాడీ దీక్షలకు సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలియజేశారు.

● రెంటచింతల, జనవరి 11 : ప్రభుత్వ ఎస్మా ప్రయోగించి జీవో నెంబర్ 2 తీసుకొచ్చినప్పటికి అంగన్వాడీలు ఇంకా సమ్మె కొనసాగిస్తుండడంతో ఐసీడీఎస్కు చెందిన రెంటచింతల 1 సెక్టార్కు చెందిన సూపర్వైజర్ వై.శ్రీదేవి గురువారం నోటీసులంటించారు. సెక్టార్-1 లోని 17 అంగన్వాడీ కేంద్రాల్లో నోటీసులను అతికించే ప్రక్రియ చేపట్టారు. పలువురు టీచర్లు మాట్లాడుతూ న్యాయమైన కోర్కెలు ప్రభుత్వం నెరవేర్చకుండా ఎస్మా ఉపయోగించడం, నోటీసులు అంటిస్తున్నా వెనక్కి తగ్గేదే లేదన్నారు. కాగా రెంటచింతలలో ఇద్దరు వర్కర్లు, హెల్పర్లు విధులకు హాజరయ్యారు.

రెంటచింతల ఎస్ఐగా నారాయణరెడ్డి

రెంటచింతల, జనవరి 11 : రెంటచింతల మండల ఎస్ఐగా కేవీ నారాయణరెడ్డిని నియమిస్తూ జిల్లా ఎస్పీ రవిశంకర్రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో మాచర్ల ఎస్ఐగా పనిచేశారు. 2023వ ఆగస్టు 5న ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన శామ్యూల్ రాజీవ్కుమార్ను స్పెషల్ బ్రాంచ్కు బదిలీ చేశారు.

చెన్నకేశవస్వామిని దర్శించుకున్న రామలింగేశ్వరరావు



రామలింగేశ్వరరావుకు ఆలయ చరిత్ర పుస్తకం అందిస్తున్న అధికారులు

మాచర్ల రూరల్, జనవరి 11 : పట్టణంలో ఉన్న శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామిని గురువారం తెలుగు కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు దర్శించుకున్నారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావు, ఈవో సాంబయ్యలు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ చరిత్ర పుస్తకాన్ని అందించారు.

కుంకలగుంటలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ

నకరికల్లు, జనవరి 11 : మండలంలోని కుంకలగుంట గ్రామంలో గురువారం రాత్రి టీడీపీ నేతలు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ అలీ బాషా, మాలపాటి మహంకాళిరావు, కిష్టంశెట్టి చిన్న, గోపు శ్రీనివాసరావు, బేరాల గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధే లక్ష్యం : జడ్పీటీసీ

పెదకూరపాడు, జనవరి 11 : మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని, మండల అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు బాధ్యతలు నిర్వహించాలని జడ్పీటీసీ కంకణాల స్వర్ణ కుమారి శివాజీ అన్నారు. పెదకూరపాడులోని మండల అభివృద్ధి కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైస్ ఎంపీపీ షేక్ చాంద్ బాషా, ఎంపీడీవో నరసింహారావు, డిప్యూటీ తహసీల్దార్ నిర్మల కృష్ణ పాల్గొన్నారు.

క్రీడాకారుల మధ్య స్వల్ప ఘర్షణ

మాచవరం జనవరి 11: మాచవరంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం జరిగిన కబడ్డీ పోటీలలో స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల సందర్భంగా మాచవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో పిన్నెల్లి, మాచవరం గ్రామాలకు చెందిన జట్లు కబడ్డీ పోటీలలో పాల్గొన్నాయి. పోటీలు జరుగుతున్న సందర్భంగా కూత విషయంలో ఇరుజట్ల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మాచవరం ఎస్ఐ సమీర్బాషా సంఘటనా స్థలానికి చేరుకొని రెండు టీమ్లను పోలీస్స్టేషన్కు తరలించి ఇరు జట్ల మధ్య రాజీ చేసి తిరిగి కబడ్డీ పోటీలు నిర్వహించారు.

గడప గడపకు రాని రేషన్ బండి

సత్తెనపల్లి, జనవరి 11 : పట్టణంలోని 13వ వార్డులో రేషన్ బండి గడప గడపకు రావటం లేదని పలువురు లబ్ధిదారులు గురువారం విలేకరులకు తెలిపారు. నిత్యవసర వస్తువులు ఇంటింటికి పంపిణీ చేయాల్సి ఉంది. కాని ఈ వార్డులో సక్రమంగా పంపిణీ జరగక కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. కంది పప్పు కూడా సక్రమంగా పంపిణీ జరగటం లేదని తెలిపారు. గట్టిగా డీలర్ను ప్రశ్నిస్తే ఇష్టమైతే సరుకులు తీసుకు వెళ్ళండి, లేకుంటే లేదని బెదిరిస్తున్నారని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వార్డులోనే కాకుండా పట్టణంలోని పలు వార్డుల్లో కూడా మొక్కుబడిగానే రేషన్ వాహనాల ద్వారా లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారులు తహసీల్దార్ సురేష్ దృష్టికి తీసుకువెళ్ళారు. వెంటనే ఆయన సివిల్ సప్లయిస్ డీటీ అరుణకు దీనిపై విచారణ జరపాలని ఆదేశించారు. సివిల్ సప్లయిస్ డీటీ అరుణ మాట్లాడుతూ రేషన్ సరుకులు ఇచ్చే వాహనం మరమ్మతులకు గురికావటం వల్ల షాపు వద్దనే లబ్ధిదారులకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాల్సి వచ్చిందని తెలిపారు.

అమరావతిలో సంక్రాంతి సంబరాలు

అమరావతి, జనవరి 11 : అమరావతిలోని శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్లో స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించి ముగ్గుల పోటీలు, భోగి మంటలు నిర్వహించారు. పోటీలను ఎమ్మెల్యే శంకరరావు, వసంతకుమారి దంపతులతో పాటు జీడీసీసీ బ్యాంక్ డైరక్టర్ కోటా హరిబాబు, జడ్పీటీసీ కరుణకుమారి, సర్పంచ్ పి.రాజేశ్వరీ, జడ్పీటీసీ కో ఆప్షన్ సభ్యులు షేక్ హఫ్సీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో...

●పెదకూరపాడు, జనవరి 11 : పెదకూరపాడులోని జీఆర్సీఆర్కే శ్రీ చైతన్య హైస్కూల్ ఆవరణలో గురువారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఆయన సతీమణి వసంత కుమారి, జడ్పీటీసీ కంకణాల స్వర్ణ కుమారి, శివాజీ, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ 40వేలు, రెండవ బహుమతిగా రూ 25వేలు, మూడవ బహుమతిగా రూ 15వేలు, నాల్గవ బహుమతిగా రూ 10వేలు, ఐదవ బహుమతిగా రూ 5వేలును ఈ సందర్భంగా వారు అందించారు.

చీరకు నిప్పంటుకొని వృద్ధురాలి మృతి

గురజాలటౌన్, జనవరి 11: చీరకు నిప్పంటుకొని వృద్ధురాలు కోలూరి సీతమ్మ (80) మృతి చెందిన సంఘటన పట్టణంలోని బంగ్లా సెంటర్లో గురువారం జరిగింది. ఆమె వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ చీరకు నిప్పంటుకుంది. స్థానికులు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి నరసరావుపేట రిఫర్ చేశారు. మార్గమధ్యంలోని దాచేపల్లి వద్ద ఆమె మృతి చెందారు. గురజాల పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్మెంట్స్) కొరకు
సంప్రః 99854 11225 | 99854 01330
99854 01690 | 99854 77867



మహిళలతో సమస్యల గురించి విచారిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన సీఎం జగన్

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

క్రోసూరు, జనవరి 11 : ఒక ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డిని వెంటనే రాష్ట్రం నుంచి తరిమి కొట్టాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆయన గురువారం మండలంలోని ఎర్రబాలెం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీల కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావటం తథ్యమన్నారు. దానికి అనుగుణంగా ప్రతి ఒక్క కార్యకర్త ప్రభుత్వం అవినీతి, అక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న కంపెనీలు ప్రభుత్వ ధన దాహాన్ని తట్టుకోలేక పక్క రాష్ట్రానికి తరలి వెళ్తున్నాయన్నారు. ప్రభుత్వం ఇసుక, మద్యం, మైనింగ్, ల్యాండ్ కబ్జాలతో అనేక రకాలుగా దోచుకున్నది చాలదన్నట్టు భూ హక్కు చట్టం తీసుకు వచ్చి మన భూములను కూడా తనఖా పెట్టే ఆలోచన చేస్తుందన్నారు. ఇదే జరిగితే మన ఆస్తులు ఏమి మిగిలి ఉండే పరిస్థితి లేదని, ప్రజలందరూ ఈ విషయంలో ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఇస్తానన్న జాబ్ క్యాలెండర్ గురించి మాట్లాడే పరిస్థితి లేదన్నారు. మన బిడ్డల భవిష్యత్ బాగుపడాలన్నా, రాష్ట్రాన్ని స్వర్ణయుగాన్ని చేయాలన్నా అది చంద్రబాబుకే సాధ్యం అన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కుంభా ఏడుకొండలు, పగడాల రాజు, మన్నెం శ్రీనివాసరావు, నలజాల కోటేశ్వరరావు, దుద్దుల యోహాన్, బందారు షైనూర్ బాబు, అనుమాల పూర్ణ, మల్లాల రామాంజనేయులు, షేక్ ముస్తఫా ఉన్నారు.

చెల్లని చెక్కు కేసులో నిందితుడికి జైలు శిక్ష

సత్తెనపల్లి జనవరి 11: చెల్లని చెక్కులు ఇచ్చిన కేసులో నిందితుడికి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ నగదు మొత్తం ఫిర్యాదుదారునికి చెల్లించాలని రెండవ అదనపు సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ గురువారం తీర్పునిచ్చారు. దీనికి సంబంధించి ఫిర్యాది తరుపున న్యాయవాది బియల్ చిన్నయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమరావతి మండలం మద్దూరుకు చెందిన పొదిలి ఆంజనేయులు దగ్గర గుంటూరుకు చెందిన రావి చంద్రయ్య 2015, 2016 సంవత్సరాలలో రూ.8 లక్షల నగదు అప్పుగా తీసుకున్నా డు. తిరిగి చెల్లించమంటే రూ.4 లక్షలకు ఒక చెక్కు చొప్పున రెండు చెక్కులను ఆంజనేయులుకు ఇచ్చాడని తెలిపారు. రెండు చెక్కులను బ్యాంకులో వేస్తే చెల్ల లేదన్నారు. దీంతో ఆంజనేయులు విడివిడిగా రెండు కేసులను సత్తెనపల్లి కోర్టులో దాఖలు చేశాడన్నారు. కేసు విచారణ సమయంలో ఫిర్యాది మరణించడంతో అతని భార్య అంజనీదేవిని వారసురాలిగా కేసులో చేర్చినట్టు తెలిపారు. కోర్టులో నేరారోపన రుజువు కావడంతో జైలు శిక్షతో పాటు చెక్కులలో పేర్కొన్న రూ.8 లక్షల నగదును ఫిర్యాదికి చెల్లించాలని సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ తీర్పునిచ్చారని ఆయన తెలిపారు.

లాటరీ టిక్కెట్ల విక్రయం చట్ట విరుద్ధం : టీడీపీ లీగల్ సెల్

సత్తెనపల్లి, జనవరి 11 : సత్తెనపల్లి నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాల పేరిట మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ఎంట్రీ పాసుల పేరిట లాటరీ టిక్కెట్లు విక్రయించటం చట్ట విరుద్ధమని టీడీపీ లీగల్ సెల్ నేతలు అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన లాటరీ టిక్కెట్ల అమ్మకాలను మంత్రి అంబటి ప్రోత్సహిస్తున్నారన్నారు. సంక్రాంతి లాటరీ టిక్కెట్లను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులతో విక్రయించటం చట్ట విరుద్ధమన్నారు. నియోజకవర్గ ప్రజలు అంబటి రాంబాబుకు తగిన గుణపాఠం చెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కన్నా లక్ష్మీనారాయణపై అవాకులు చెవాకులు పేలితే సహించేదే లేదని హెచ్చరించారు. సమావేశంలో బత్తుల ఆదినారాయణ, బొక్కా సంగీతరావు, జానీ ఖాజావలి, దివ్వెల శ్రీనివాసరావు, అనుమోలు జయరామ్ తదితరులు ఉన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం : మద్దిరాల

పెదకూరపాడు, జనవరి 11 : వైసీపీ ప్రభుత్వ పాలనలో బీసీలకు అన్యాయం జరిగిందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ అన్నారు. పెదకూరపాడులోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం మండల టీడీపీ నేతలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ మాట్లాడుతూ ఈనెల 24న పెదకూరపాడులో జయహో బీసీ సభ జరుగుతుందని, పెద్ద సంఖ్యలో బీసీలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాలివాహన కమిటీ రాష్ట్ర సభ్యులు మోదుగుల చంద్రశేఖర్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్, బీసీ సెల్ అధ్యక్షులు కోరంపల్లి నరేంద్ర, బలుసుపాడు సర్పంచ్ నల్లమేకల సాంబశివరావు, తుమాటి ఏడుకొండలు, బీసీ సెల్ నేతలు షేక్ నబీ సాహెబ్, కృష్ణయ్య, అనుముల వెంకటరావు, బలుసుపాడు చిరంజీవి, బత్తుల రమేష్, డాక్టర్ అవ్వారి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

చాగల్లుతో ఎంతో అనుబంధం : కాసు



ఆత్మీయుల సమ్మేళనంలో పాల్గొన్న కాసు వెంకట కృష్ణారెడ్డి

నకరికల్లు, జనవరి 11 : చాగల్లు గ్రామంతో తనకు ఎంతో ప్రత్యేక అనుబంధం ఉందని మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి ఆనాటి విషయాలను గుర్తు చేసుకున్నారు. గురువారం ఆయన నకరికల్లు మండలం చాగల్లు గ్రామంలో తనకు ఉన్న పరిచయస్తులతో, గ్రామ ప్రజలతో ఆత్మీయంగా సమావేశం అయ్యారు. 1978లో తాను తొలిసారిగా శాసన సభ్యునిగా ఎన్నికైన సమయం నుంచి తనకు చాగల్లుతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. కాసు వచ్చారని తెలుసుకున్న చాగల్లుతో పాటు మండలం లోని వివిధ గ్రామాల నాయకులు కలుసుకొని ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, వంగా రాజారెడ్డి, అలపర్తి భాస్కరరావు, సర్పంచ్ అలపర్తి కృష్ణకుమారి, కాండ్రు బిక్కయ్య, అలపర్తి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దొంతుల రంగయ్య, లింగాల వీరయ్య, షేక్ షరీఫ్, బడే సైదా, నాగుల్ మీరా, కానాల చెంచిరెడ్డి, ఇమామ్సా తదితరులు పాల్గొన్నారు.

రాజేష్ మృతికి కొమ్మాలపాటి సంతాపం

అమరావతి, జనవరి 11 : మండల పరిధిలోని ముత్తాయపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కట్టా రాజేష్ మృతికి మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ తన సంతాపం తెలిపారు. రాజేష్ మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

బెల్లంకొండ, జనవరి 11 : మండలంలోని నందిరాజుపాలెం, గంగిరెడ్డిపాలెం గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డ్రోన్ ద్వారా రైతులకు మందులు పిచికారి ఎలా చేయాలో అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో కృష్ణయ్య, ఎంపీడీవో వెంకటరెడ్డి, సరోజిని శివారెడ్డి, మరియదాసు, ఆసుల జగన్ తదితరులు పాల్గొన్నారు.





చిక్కులు తెచ్చిపెట్టిన నయన్ అన్నపూరణి

నెట్‌ఫ్లిక్స్ నుంచి తొలగింపు



ఇటీవలే ఓటీటీ స్ట్రీమింగ్ మొదలైన నయనతార రీసెంట్ మూవీ 'అన్నపూరణి'ని ఉన్నట్టుండి ఓటీటీ ప్లాట్‌ఫామ్ నుంచి తొలిగించారు. స్వయంగా ఆ చిత్ర నిర్మాణసంస్థ అయిన జీ స్టూడియోస్ ఈ నిర్ణయం తీసుకుంది. నిజానికి 'అన్నపూరణి' థియేటర్లలో కూడా పెద్దగా ఆడలేదు. థియేటర్లలో మిశ్రమ స్పందనతో నిర్మాతకు నష్టాలే తెచ్చిపెట్టింది. రీసెంట్‌గా ఈ సినిమాను ఓటీటీలో విడుదల చేశారు. అసలు చిక్కు ఇక్కడే వచ్చింది. కథ ప్రకారం ఇందులోని కొన్ని సన్నివేశాలు మత విశ్వాసాలను భంగపరిచేలా ఉన్నాయని పలువురు అభ్యంతరాలు వెలిబుచ్చారు. నయన్‌తోపాటు చిత్రబృందంపై మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్, ముంబైలో కేసులు నమోదయ్యాయి. దీంతో చిత్ర నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ ఈ సినిమాను ఓటీటీ స్ట్రీమింగ్ నుంచి తొలగించింది. మతవిశ్వాసాలను కించపరిచే ఉద్దేశం తమకు లేదని, తమకు అన్ని మతాలూ సమానమేనని, ఈ విషయంలో తెలిసీగానీ, తెలియకగానీ ఎవర్నయినా బాధపెట్టి ఉంటే క్షమించాలని జీ స్టూడియోస్ వివరణ ఇచ్చుకుంది. 'అగ్నిహోత్రం లాంటి సంప్రదాయ కుటుంబంలో పుట్టిన ఓ అమ్మాయి, చెఫ్ కావాలనే తన కోరికను ఎలా సాకారం చేసుకుంది? అనే ప్రశ్నకు సమాధానమే 'అన్నపూరణి' కథ. నయనతార టైటిల్‌రోల్ పోషించిన ఈ చిత్రంలో సత్యరాజ్, జై కీలక పాత్రలు పోషించారు. నీలేశ్ కృష్ణ దర్శకుడు.

ఫిబ్రవరిలో హ్యాపీ ఎండింగ్



యష్ పూరి కథానాయకుడిగా నటించిన చిత్రం 'హ్యాపీ ఎండింగ్'. అపూర్వ రావ్ కథానాయిక. కౌశిక్ భీమిడి దర్శకత్వంలో యోగేష్ కుమార్, సంజయ్ రెడ్డి, అనిల్ పల్లాల నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకు తీసకొస్తున్నట్లు యూనిట్ గురువారం తెలిపింది. 'ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలకు చక్కని ఆదరణ లభిస్తోంది, వైవిధ్యమైన కథతో 'హ్యాపీ ఎండింగ్' చిత్రాన్ని రూపొందించాం' అని మేకర్స్ తెలిపారు. అజయ్ ఘోష్, విష్ణు, ఝాన్సీ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: రవి నిడమర్తి. సినిమాటోగ్రఫీ: అశోక్ సీపల్లి







పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



మృతి చెందిన గొర్రెలు

వీధి కుక్కల దాడిలో 26 గొర్రెలు మృతి

నూజెండ్ల, జనవరి 11: వీధి కుక్కల దాడిలో 26గొర్రెలు మృతిచెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మర్రి గంగయ్యకు చెందిన 30 గొర్రెలను ఇనుప మెస్ రక్షణగా ఉన్న దొడ్డిలో తోలి ఇంటి వద్ద నిద్రిస్తున్న సమయంలో వీధి కుక్కలు దొడ్డిలోకి వెళ్ళి గొర్రెలపై దాడికి దిగాయి. 26 గొర్రెలు మృతి చెందాయి. దీంతో మూడు లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని గంగయ్య కుటుంబ సభ్యులు తీవ్రంగా దుఃఖిస్తున్నారు. కుక్కల దాడిలో గొర్రెలు మృతిచెందటం రైతుకు వచ్చే నష్టాన్ని చూసిన తోటి రైతులు ధైర్యం చెపుతూ బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని అభిప్రాయం వ్యక్తంచేశారు. గ్రామంలో వీధి కుక్కలతో ప్రతినిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయనే అభిప్రాయం గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ అవినీతిపై పోరాడుదాం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ

నరసరావుపేట టౌన్, జనవరి 11: వైసీపీ అవినీతిపై పోరాడుదాం, తెలుగుదేశం పిలుస్తోంది రా.. కదలిరా అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వైసీపీ నాయకుల అక్రమ మద్యం తరలింపులు మరోసారి బయటపడ్డాయని, అక్రమంగా మద్యం తరలిస్తున్న వైసీపీ నాయకుడిని సెబ్ ఎస్ఐ పట్టుకోగా వైసీపీ నాయకుడు ఎస్ఐపై దుర్భాషలాడటం దుర్మార్గమైన చర్య అని ఆరోపించారు. అధికార మదంతో విధి నిర్వహణలలో ఉన్న ఎస్ఐని దుర్భాషలాడిన వైసీపీ నాయకుడిని కఠినంగా శిక్షించాలన్నారు. లేనిపక్షంలో వీధినపోయే ప్రతి వైసీపీ రౌడీ అధికారమదంతో దుర్భాషలాడతారన్నారు. ఉద్యోగుల విధి నిర్వహణ వైసీపీ నాయకుల అక్రమ సంపాదనకు చరమగీతం పాడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయాలకు తలవంచకుండా ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఇలాగే విధులు నిర్వహించి వైసీపీ అక్రమ సంపాదనకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడటం ఖాయం

● టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల

నరసరావుపేట టౌన్, జనవరి 11: వైసీపీ ప్రభుత్వం అవినీతి, అక్రమాలు ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే టీడీపీ జనసేన ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో అన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు నిర్వహిస్తున్న రా కదలి రా విజయవంతం అవుతుందని, ఈ సభలకు భారీగా ప్రజలు తరలి వస్తున్నారని అన్నారు. పల్నాడు జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యేల అవినీతి అంతా ఇంతా కాదని, ఇసుక, మట్టి మాఫియా నాయకులకు సపోర్టు చేస్తూ కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నిరుద్యోగుల సంఖ్య పెరుగుతూ వచ్చిందని, ఇక్కడ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో పక్క రాష్ట్రాలకు పోతున్నారని అన్నారు. రాష్ట్రాన్ని అంధకారం నుంచి బయట పడాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఎంతైనా అవసరం అన్నారు.

అక్రమ మద్యంపై కేసు నమోదు

● సిబ్బందిని దూషించిన ఓ ప్రజాప్రతినిధి

నరసరావుపేట లీగల్, జనవరి 11: అక్రమంగా 96సీసాల మద్యాన్ని తరలిస్తూ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులకు చిక్కి వారిని బెదిరించిన సంఘటన బుధవారం రాత్రి పట్టణంలోని బాబాపేట వద్ద చోటు చేసుకుంది. తుదకు వివిధ శాఖల ఉన్నతాధికారులు, రాజకీయనేతల జోక్యంతో వివాదం సర్దుమణిగింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఓ ప్రభుత్వ మద్య దుకాణం నుంచి 96సీసాల మద్యాన్ని గుంటూరు రోడ్డులోని ఓ రెస్టారెంట్‌లో సర్వర్‌గా పని చేస్తున్న వ్యక్తి మోటారు సైకిల్‌పై తీసుకు వెళ్తుండగా బాబాపేట గేటు సమీపంలో నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యక్తి ఈ విషయాన్ని ఎంపీటీసీ ఐన రెస్టారెంట్ నిర్వాహకుడికి తెలియచేశాడు. సదరు రాజకీయ నేత ఘటనాస్థలికి వచ్చి సిబ్బందిని దూషించి వారి వద్ద నుంచి సిబ్బంది స్వాధీనం చేసుకున్న మోటారు సైకిల్ తాళాన్ని లాక్కున్నాడు. ఈ విషయాన్ని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబుకు తెలియజేశారు. సురేంద్రబాబు ఘటనాస్థలికి రాగా సదరు రాజకీయనేత వాగ్వివాదానికి దిగాడు. ఎస్ఐ కేసు పెట్టడానికి వెళ్తుండగా ఉన్నతస్థాయి వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, రాజకీయ నేతల ఒత్తిడి మేరకు విధులకు ఆటంకం కలిగించిన కేసును నమోదు చేయకుండా కేవలం అక్రమ మద్యం కలిగి ఉన్నట్టు కేసు నమోదు చేశారు. నిందితుడైన పట్టణానికి చెందిన ఎం.వినోద్‌ను అరెస్టు చేసి గురువారం కోర్టులో ప్రవేశపెట్టారు. కాగా ఈ విషయమై ఎస్ఐ సురేంద్రబాబును వివరణ కోరగా తమ సిబ్బందిపై దురుసురుగా ప్రవర్తిస్తున్నట్టు సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి వెళ్ళానని, తాను వెళ్ళిన తరువాత ఏ విధమైన సంఘటనలు చోటు చేసుకోలేదని, నిందితుడిని అరెస్టుచేసి కోర్టులో ప్రవేశపెట్టామని తెలిపారు.

కోడి పందాలు, గుండాట, జూదం నిషేధం: ఎస్పీ

నరసరావుపేట లీగల్, జనవరి 11: పల్నాడు జిల్లాలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందాలు, గుండాట, జూదం నిర్వహించటాన్ని నిషేధించినట్టు పల్నాడు జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసు ఆజ్ఞలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా నిషేధించిన కోడిపందాలు, జూదం, గుండాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటుచేసి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలెవ్వరూ సంక్రాంతి సందర్భంగా ఎటువంటి జూదాలకు పాల్పడ వద్దన్నారు. గతంలో కోడిపందాలు నిర్వహించినా, ఆడిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి: ఎస్పీకి జీవీ వినతి

నరసరావుపేట లీగల్, జనవరి 11: పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పల్నాడు జిల్లా ఎస్పీ వై రవి శంకర్‌రెడ్డిని కలిశారు. గత పది రోజుల క్రితం బొల్లాపల్లి మండలం పలుకూరులో జరిగిన సంఘటనలో దెబ్బతిన్న బాధితులకు తగు న్యాయం చేయాలని గురువారం వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బొల్లా బ్రహ్మనాయుడు స్వార్ధం కోసం పచ్చని గ్రామాల్లో చిచ్చు పెడుతున్నారన్నారు. బొల్లాపల్లి మండలం పలుకూరులో ఒక పథకం ప్రకారం బైక్‌పై వెళ్తున్న టీడీపీ బీసీ కార్యకర్తలపై కావాలని వైసీపీ వర్గీయులు దాడి చేశారన్నారు. గాయపడ్డ టీడీపీ కార్యకర్తలను కనీసం ఆస్పత్రికి కూడా తీసుకు వెళ్ళనీయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులకు స్థానిక పోలీసు స్టేషన్‌లో కాఫీలు, టీలు ఇస్తున్నారని, మా పై దాడులు చేసి తిరిగి తమ పైనే కేసులు పెడుతున్నారన్నారు. 60 నుంచి 70 మంది వైసీపీ వర్గీయులు తమ కార్యకర్తల పై దాడులు చేస్తే కేవలం 14మందిపై మాత్రమే కేసులు నమోదు చేశారన్నారు. కార్యక్రమంలో బొల్లాపల్లి టీడీపీ మండల నాయకులు, మాజీ ఏఎంసీ పీ నాగేశ్వరరావు, పీ వెంకట నారాయణ, ఆళ్ళ మన్నెయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డిపై తెలుగు యువత నాయకుల ఫిర్యాదు

నరసరావుపేట లీగల్, జనవరి 11: ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి యువతను మోసం చేశారని, ప్రతి ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానన్న జగన్‌రెడ్డి ఐదు సంవత్సరాలు గడిచినా ఒక్క జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా మోసం చేశారని పేర్కొంటూ రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహణ కార్యదర్శి పొనుగోటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మొదటి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శాఖమూరి మారుతీ, పార్టీ నేతలు మహమ్మద్ రఫీ, నాగూర్, ఖాశిం సైదులు, బడేబాబు, మహబూబ్ బాషా, మాబూ, కరిముల్లా, సుభానీ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిగరెట్ దుకాణాలపై విజిలెన్స్ అధికారుల తనిఖీ

వినుకొండటౌన్, జనవరి 11: పట్టణంలోని పలు సిగరెట్ దుకాణాలపై విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. బిల్లులు లేకుండా విక్రయిస్తున్న నందకిషోర్, కృష్ణసాయి ఫ్యాన్సీ, కార్తికేయ ట్రేడర్స్‌లలో సాయంత్రం వరకు విజిలెన్స్ సీఐ శీలం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో ట్యాక్స్ రహిత సిగరెట్లను పెద్దమొత్తంలో గుర్తించినట్లు వినుకొండ పోలీసులు తెలిపారు. విజిలెన్స్ అధికారుల తనిఖీలో వెలుగుచూసిన సిగరెట్ల విలువను వెల్లడించేందుకు పోలీసులు సుముఖత వ్యక్తం చేయకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా కేవలం మూడు షాపుల్లో తనిఖీలు చేసి పెద్దమొత్తంలో వెలుగుచూసిన సరుకును కేవలం కొద్ది సరుకును పోలీసులకు అప్పజెప్పి విజిలెన్స్ అధికారులు వెళ్లడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది.

అంగన్‌వాడీలపై ఎస్మాను ఉపసంహరించుకోవాలి

● వివిధ రాజకీయపార్టీలు, ప్రజా సంఘాల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు

నరసరావుపేట టౌన్, జనవరి 11: అంగన్‌వాడీలపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఏకగ్రీవంగా తీర్మానించాయి. గురువారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని కోటప్పకొండ రోడ్డులో ఉన్న సీపీఎం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా పార్టీల, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీలను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వై రాధాకృష్ణ, పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి షేక్ అబ్దుల్ రవూఫ్, పీడీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యుడు కే ఏడుకొండలు, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి జే.బ్రహ్మయ్య, జైభీమ్ భారత్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోదా జాన్ పాల్, శ్రామిక మహిళ సమాఖ్య కన్వీనర్ డీ శివకుమారి, కొల్లి వెంకటేశ్వర్లు, కామినేని రామారావు, నల్లపాటి రామారావు, ఉప్పలపాటి రంగయ్య ఎంఐఎం షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆందోళన

నరసరావుపేట టౌన్, జనవరి 11: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ అసోసియేషన్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా పల్నాడు జిల్లా నరసరావుపేట గాంధీ పార్కువద్ద నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమం గురువారం కొనసాగింది.

ప్రభుత్వం పట్టించుకోలేదు: లూథియా

అంగన్‌వాడీలు ఆందోళన కార్యక్రమంలో భాగంగా వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలుచేయాలని, మినీ సెంటర్‌లను మెయిన్ సెంటర్‌లుగా మార్చాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని 31రోజులుగా ప్రభుత్వాన్ని అడుగుతా ఉన్నామని నరరసరావుపేట ప్రాజెక్టులోని అంగన్‌వాడీ వర్కర్ లూథియా అన్నారు. అంగన్‌వాడీ నాయకులను పిలిచి సమస్యలు పరిష్కరిస్తే, ఏ ఎస్మా వద్దని, ఎటువంటి నోటీసులు వద్దు, రాజకీయ ఒత్తిడిలు అవసరం లేదని, వెళ్ళి విధులలో చేరతామని చెప్పారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కేపీ మెటిల్డాదేవి మాట్లాడుతూ సూపర్‌వైజర్లు, సీడీపీవోల వేధింపులు ఆపాలన్నారు. అంగన్‌వాడీల ఆందోళన కార్యక్రమానికి గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు ప్రభాకర్ సంఘీభావం తెలియజేశారు.



ఆందోళనలో పాల్గొన్న అంగన్‌వాడీలు, హెల్పర్లునుద్దేశించి మాట్లాడుతున్న కేపీ మెటిల్డాదేవి తదితరులు

● చిలకలూరిపేట: పట్టణంలో అంగన్ వాడీల సమ్మె గురువారం 31వ రోజుకు చేరింది. స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద అంగన్ వాడీలు దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు జీ సావిత్రి, రైతు సంఘం డివిజన్ కార్యదర్శి బొల్లు శంకరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాలను ప్రయోగించి అంగన్ వాడీల ఉద్యమం ఆపలేరన్నారు. ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ ప్రభుత్వ నిరంకుశ విధానాలపై కళారూపాల ద్వారా వీధి నాటకం రూపంలో ప్రజలకు తెలియ చెబుతామన్నారు. దీక్షా శిబిరంలో ఆయన పాటలను పాడి అంగన్‌వాడీలను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్ బాబు, పేరుబోయిన వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్ లూథర్ తదితరులు పాల్గొన్నారు.



31వ రోజు కొవ్వొత్తుల వెలుగులో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

కొవ్వొత్తుల వెలుగులో రాత్రంతా నిరసన

వినుకొండటౌన్, జనవరి 11: అంగన్‌వాడీ కార్యకర్తలు రోడ్లపై సమ్మెలు చేస్తున్నా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని యూటీఎఫ్ నాయకులు రవికుమార్ అన్నారు. స్థానిక సురేష్‌మహల్ రోడ్డులోని 31 రోజు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు బుధవారం రాత్రి చేపట్టిన నిరసన దీక్షకు యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు టెంట్‌లో 31వ రోజు సమ్మెలో భాగంగా కొవ్వొతుల వెలుగులో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిబాబు, నాగేంద్రుడు, అజయ్‌కుమార్, రామారావు, మల్లికార్జునరావు, జిలానీ, డీవైఎఫ్ నాయకులు ఎం.సుబ్బారావు, సీఐటీయూ నాయకులు హనుమంతరెడ్డి, శివరామకృష్ణ, వెంకటేశ్వ ర్లు, అంగన్‌వాడీ జిల్లా కోశాధికారి లక్ష్మీప్రసన్న, ఉమా శంకరి, జి.పద్మ, గా యత్రి, శ్రీదేవి, రాజకుమారి, సూర్య, కృష్ణకుమారి, నాసరమ్మ పాల్గొన్నారు.

డబుల్ ఎంట్రీపై ఆధారాలున్నా చర్యలు నిల్

వినుకొండ టౌన్, జనవరి 11: గ్రామం, పట్టణం అని తేడా లేకుండా వైసీపీ నాయకుల డబుల్ ఎంట్రీలు కుప్పలుతెప్పలుగా వెలుగుచూస్తున్నాయి. మండల పరిధిలోని గ్రామాల్లో నివసించకుండా పట్టణాల్లో నివసించే వారి ఓట్లను తొలగిస్తామని బీఎల్‌వోలు సూచించినప్పటికీ ఎక్కువ సంఖ్యలో ఓటర్లు పట్టణంలో నివసించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. గ్రామాల్లోని ఓట్లు తొలగిస్తే ఊరుకునేది లేదంటూ బీఎల్‌వోలపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. పట్టణంలోని రెడ్డినగర్‌లో బూత్ నెం.21లో ఏకంగా 20కు పైగా డబుల్ ఎంట్రీలు వెలుగుచూశాయి. ఒకే బూత్‌లో ఇంటి నెం.23-1017/8, 23-1023/1, 1031/1, 1032/1, 1043/3, 1059/3, 1063/5, 925/1, 930/2, 944, 951, 974, 976, 986 ఇలా ఒక్కొక్క ఇంటి నంబరుతో రెండు నుంచి మూడు ఓట్లు కలిగి ఉండటం గమనార్హం. వీరికి మేకలదిన్నె తండా, నరగాయపాలెం, పువ్వాడ కొత్తపాలెం, విఠంరాజుపల్లి, గండిగనుమల, జాలలపాలెం, నాగులవరం, నూజెండ్ల, సీతారామపురం తండా గ్రామాల్లో కూడా ఓట్లు ఉన్నట్లు గుర్తించారు. బొల్లాపల్లి మాజీ సర్పంచ్ షేక్ ఖాశీం వినుకొండ పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో, బొల్లాపల్లిలో ఓటు హక్కు కలిగి ఉండటం గమనార్హం. ఇలా చెప్పుకుంటూపోతే పట్టణంలో ప్రతివార్డులో డబుల్ ఎంట్రీలు ఉన్నప్పటికీ అధికారులు తొలగించకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తుంది. ఈ విషయంపై నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్రీరామరెడ్డిని వివరణ కోరగా డబుల్ ఎంట్రీలు కలిగిన ప్రతి ఒక్కరిపై పార్టీలతో సంబంధం లేకుండా పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, ఓటర్లకు తెలియకుండా ఫారం-7 దరఖాస్తులు ఇచ్చిన వారిపై కూడా ఫిర్యాదు చేస్తామన్నారు.

వినుకొండలో అదనపు కోర్టు ఏర్పాటుకు వినతి

వినుకొండ టౌన్, జనవరి 11: వినుకొండలో అడిషనల్ కోర్టు ఏర్పాటు చేయాలంటూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లా సెక్రటరీ జి.సత్యప్రభాకర్‌రావును కలిసి వినతిపత్రం అందజేసినట్లు అధ్యక్షుడు చాగంటి వీరాంజయచౌదరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదనపు కోర్టు ఆవశ్యకత గురించి ఇప్పటికే జిల్లా జడ్జితో పాటు హైకోర్టు పోర్టు పోలియో జడ్జికి తెలియజేయడం జరిగిందన్నారు.

గీతమ్స్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

వినుకొండ, జనవరి 11: పట్టణంలోని సిద్ధార్థనగర్‌లోని గీతమ్స్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి హాజరై విద్యార్థులకు సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. తెలుగుదనం ఉట్టిపడేలా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చీరల పంపిణీకి కూపన్లు

వినుకొండటౌన్, జనవరి 11 : త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో పలు గ్రామాల్లో అధికార వైసీపీకి చెందిన నాయకులు ఇప్పటికే తాయిలాల పంపకానికి శ్రీకారం చుట్టారు. నూతన సంవత్సర, సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు చీరలు, మగవారికి దుస్తులు పంపిణీకి ఇప్పటికే కూపన్లు పంపిణీ చేయడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. కూపన్ ఇస్తేనే స్థానిక నాయకులు తాయిలాలను అందిస్తున్నట్లు సమాచారం. గురువారం స్థానిక వైసీపీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జననీ ఫౌండేషన్ ద్వారా చీరలు పంచుతుంటే రాజకీయం చేస్తున్నారని నిందలు వేస్తున్నారంటూ మండిపడటం కొసమెరుపు.

చిన్నారులకు ఆటల పోటీలు

యడ్లపాడు, జనవరి 11: సంక్రాంతి పండుగ సందర్భంగా చిన్నారులకు పలు ఆటల పోటీలు గురువారం నిర్వహించారు. యడ్లపాడు పీఆర్ విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల పేరుతో నిర్వహించిన ఈ ఆటల పోటీలను అధ్యాపకురాలు కె.రత్నకుమారి ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన చిన్నారులు శ్రీరామ్, నాగలీలావతి, సోని, పవన్, సాయికృష్ణ, దేవేంద్రకుమార్, చరణ్, భవానీ, అనూషలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమాలను పీఆర్ విజ్ఞానకేంద్రం బాధ్యులు ఎన్.కాళిదాసు, విజయలక్ష్మి, పి.రూపాదేవి, బి.హరీష్, మోహన్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన సదస్సు

నరసరావుపేట లీగల్, జనవరి 11: పల్నాడు జిల్లా ఎస్పీ వై రవిశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు ఎన్నికల సమయంలో పోలీసు అధికారులు పాటించాల్సిన నియమ నిబంధనలపై గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని పోలీసు అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో నరసరావుపేట ఏపీపీ ఎస్ విజయకుమార్ ఐపీసీలో ఎన్నికల నేరాలకు సంబంధించి చట్టాలను వివరించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని కూడా వివరించారు. ఏపీపీలు స్వర్ణలత భాను, నరసింహారావు, డీఎస్పీ కేవీ మహేష్‌లు ఎన్నికల నిర్వహణపై పలు అంశాలను వివరించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టు ఎంపిక




ఎంపిక చేసిన రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుతో నిర్వాహకులు

నరసరావుపేట కల్చరల్, జనవరి 11: నరసరావుపేట పట్టణంలో డీఎస్ఏ స్టేడియంలో ఈ నెల 6నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన క్రీడాపోటీల్లో ప్రతిభ చూపించిన క్రీడాకారులతో రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టును ఎంపికచేసినట్లు పల్నాడు జిల్లా స్పోర్ట్స్ సెక్రటరీ సీహెచ్ కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు వివరాలను ఆయన తెలియజేశారు. ఎస్.విష్ణుసాయి (కడప), ఏఎస్ కుళ్లాయప్ప (కడప), జీవీఎస్ సాకేత్ (కడప), ఏ దేవాషిష్ (విశాఖపట్నం), ఏ రోహిత్ (విశాఖపట్నం), జి.దేవప్రమోద్ (గుంటూరు), షేక్ నాగుర్ అబ్దుల్ జబ్బార్ (గుంటూరు), వీపీ శ్రీనివాసరెడ్డి (గుంటూరు), షేక్ హుస్సేన్ షరీఫ్ (గుంటూరు), ఎస్ సాయిచరణ్ (చిత్తూరు), సి.ఉత్తేజ్ (చిత్తూరు), ఎస్ఎల్‌యూకేవై సిద్ధు (చిత్తూరు), షేక్ సమీరుద్దీన్ (పశ్చిమ గోదావరి), పీఎస్ కశ్యప్ (తూర్పు గోదావరి), టీ శంకర్‌రెడ్డి (కర్నూలు), పీ హామేష్‌రామ్ (నెల్లూరు)లు ఎంపికైనట్లు తెలిపారు. కాగా వీరంతా ఈ నెల 15వ తేదీ నుంచి 22 వరకు బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగే 67వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్-17 విభాగంలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎం.విక్రమ్‌సింగ్, వ్యాయమ ఉపాధ్యాయులు పూజల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాదెండ్ల, జనవరి 11: మండలంలోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అంతరాయం కలుగుతుందని డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. నాదెండ్ల సబ్‌స్టేషన్ పరిధిలో నాదెండ్ల, తూబాడు, చిరుమామిళ్ళ, సంక్రాంతిపాడు, జంగాలపల్లి, అమీన్‌సాహెబ్‌పాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఇర్లపాడు, అమీన్‌సాహెబ్‌పాలెం, ఎండుగుంపాలెం, రాజుగారిపాలెం, గున్నంవారిపాలెం, గణపవరం పరిధిలో గణపవరం, సినిమాహాల్, ఏలూరురోడ్డు, రాజీవ్‌గాంధీకాలనీ, చవిటిపాలెంలలో అంతరాయం కలుగుతుందన్నారు.

ఎన్నికలకు పటిష్టమైన చర్యలు: ఎస్ఐ తిరుపతిరావు



కారుమంచి గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపతిరావు

శావల్యాపురం, జనవరి 11: రానున్న ఎన్నికలలో గ్రామాలలో ఎటువంటి రాజకీయ వివాదాలకు తావులేకుండా భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తుశ్మారి తిరుపతిరావు అన్నారు. మండలంలోని కారుమంచిలో 2019 ఎన్నికలకు ముందు బైండోవర్ చేసిన ఇరు పార్టీల వ్యక్తులను ఎస్ఐ గురువారం కలిశారు. బైండోవర్ చేయాల్సిన వ్యక్తుల జాబితాను వారికి అందజేసి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి బైండోవర్ చేయించుకోవాలన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున ఎస్పీ ఆదేశాల మేరకు బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని, ప్రస్తుతం మండలంలో 120మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు.

ఆడుదాం-ఆంధ్ర పోటీల్లో ఇరుజట్ల మధ్య వివాదం

● నేడు రీమ్యాచ్‌కు చర్యలు

శావల్యాపురం, జనవరి 11: స్థానిక జడ్పీపాఠశాలలో నిర్వహిస్తున్న ఆడుదాం-ఆంధ్ర మండలస్థాయి క్రికెట్ పోటీలలో గురువారం పొట్లూరు, మతుకుమల్లి జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుండగా అంపైర్ నిర్ణయంపై ఇరుజట్ల మధ్య వివాదం రేగింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మతుకుమల్లి జట్టు 10ఓవర్లలో 67పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పొట్లూరు జట్టు చివరి 3ఓవర్లలో 15పరుగులు కొట్టాల్సి ఉండగా బౌలర్ బౌలింగ్ చేసే సమయంలో బ్యాట్స్‌మన్ క్రీజ్ వదిలేసి ముందుకు వెళ్ళడంతో బౌలర్ రనౌట్ చేశాడు. దీనిపై పొట్లూరు క్రీడాకారులు వాగ్వివాదానికి దిగారు. దీంతో ఎంపీడీవో సీతారామయ్య, పీడీ రాధాకృష్ణమూర్తి వారికి సర్దిచెప్పి సూపర్‌ఓవర్ ఆడించారు. మరలా టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన మతుకుమల్లి జట్టు తొలి ఐదు బంతుల్లో 11పరుగులు చేసింది. మరలా ఇక్కడ కూడా ఎంపైర్ నిర్ణయాన్ని పొట్లూరు క్రీడాకారులు వ్యతిరేకించడంతో మరోసారి ఇరుజట్ల మధ్య ఘర్షణ జరిగింది. దాంతో ఎంపీడీవో, పీడీలు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళగా శుక్రవారం రీమ్యాచ్ నిర్వహించేలా ఇరుజట్లుకు సర్దిచెప్పాలని, ఇద్దరు అంపైర్లను తాము పంపిస్తామని చెప్పడంతో దానికి ఇరుజట్లు అంగీకరించాయి. శుక్రవారం ఉదయం ఇరుజట్లుకు రీమ్యాచ్ నిర్వహిస్తామని ఎంపీడీవో ప్రకటించారు.

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్ర॥ 99854 11226, 99854 11220
99852 07026

అధికార పార్టీ కార్యాలయాలుగా గ్రామ సచివాలయాలు

● శావల్యాపురం మండల టీడీపీ అధ్యక్షుడు సాంబశివరావు



మతుకుమల్లి సచివాలయంలో భద్రపరచిన ఎమ్మెల్యే కానుకలు

శావల్యాపురం, జనవరి 11: గ్రామాలలో లక్షలకొద్దీ ప్రజాధనాన్ని ఖర్చుచేసి నిర్మించిన గ్రామ సచివాలయాలను అధికారపార్టీ నాయకులు సొంతానికి వాడేసుకుంటూ అధికార పార్టీ కార్యాలయాలుగా మార్చారని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు బుధవారం ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో మహిళా ఓటర్లను మభ్యపెట్టేందుకు సంక్రాంతి కానుకలంటూ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నియోజకవర్గంలో ఓట్లున్న మహిళలకు చీరెలు పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యాడని, పార్టీపరంగా పంపిణీ చేసేందుకు తెచ్చిన చీరెలను ప్రభుత్వ కార్యాలయాలైన గ్రామ సచివాలయాలలో భద్రపరచడంపై ప్రశ్నించారు. చీరెల పంపిణీ చేసేందుకు జాబితాల తయారీలో మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కీలకపాత్ర పోషించారని, వలంటీర్లు గ్రామాలలో ఇంటింటికీ తిరిగి మహిళల నుంచి ఆధార్‌కార్డు, ఓటరు కార్డు జిరాక్స్‌లను సేకరించి కూపన్‌లు పంపిణీ చేశారని, ప్రభుత్వ శాఖలలో పని చేస్తూ ప్రభుత్వం నుంచి వేతనాలు పొందుతూ అధికారులు, వలంటీర్లు పార్టీ కార్యక్రమాలలో ఎలా పాల్గొంటారని ప్రశ్నించారు. ఎన్నికల ప్రక్రియలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొనకూడదని ఓవైపు ఎన్నికల సంఘం అధికారులు, సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేస్తున్నా వాటిని లెక్కచేయకుండా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఎన్నికల ప్రక్రియలో తలదూరుస్తున్నారని, ఎన్నికల తాయిలాలను సచివాలయాలలో భద్రపరచడం వారి లెక్కలేనితనానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే అభిమానంతో సంక్రాంతి కానుకలు ఇవ్వాలనుకుంటే ఆధార్, ఓటరు కార్డులతో పనేంటని మహిళలంతా గ్రహించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

నాటి సంక్రాంతి వెలుగులేవి జగన్‌రెడ్డి?

● భవిష్యత్ గ్యారెంటీ ప్రచారంలో మాజీ మంత్రి ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జనవరి 11: రాష్ట్ర ప్రజలకు నాటి సంక్రాంతి వెలుగులేవి అంటూ వైసీపీ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిపై మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు మండిపడ్డారు. చంద్రబాబు అంటే సంక్షేమం, జగన్‌రెడ్డి అంటే అరాచకం అని ప్రజలే అనుకుంటున్నారన్నారని ఆయన తెలిపారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వంలో పండుగలు వస్తే చంద్రన్న కానుకలు ఇంటింటికి చేరేవని, జగన్ వచ్చాక ఆ కానుకలు మాయం చేశారని ధ్వజమెత్తారు. జగన్‌కు తెలిసిందల్లా రద్దులు, కూల్చివేతలు, దాడులు, అక్రమ కేసులేనని ప్రత్తిపాటి ఎద్దేవా చేశారు. నిత్యావసరాల పెరుగుదలతో రాష్ట్రంలో పెద్ద పండుగ సంక్రాంతి శోభ లేకుండా పోయిందన్నారు. పట్టణంలోని 26,27,28 వార్డుల్లో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మినీ మేనిఫెస్టోపై ప్రచారం నిర్వహించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయబోయే సూపర్-6 పథకాల గురించి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాల గురించి ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీ, జనసేన కూటమి క్లీన్ స్వీప్ చేయబోతుందని, కార్యకర్తలు మరింత ఉత్సాహంతో పనిచేయాలని ప్రత్తిపాటి పిలుపునిచ్చారు. రాష్ట్రం బాగుపడాలంటే యువత టీడీపీ, జనసేన జెండాలు పట్టుకొని ప్రజల్లో చైతన్యం తేవాలని ప్రత్తిపాటి సూచించారు.

బీసీలంతా టీడీపీ, జనసేన గెలుపునకు కృషి చేయాలి: భీమవరపు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 11: వైసీపీలో బీసీ నేతలకు, బలహీన వర్గాల ప్రజలకు గౌరవం లేదని, పెద్దిరెడ్డి, విజయ సాయిరెడ్డి, సుబ్బారెడ్డి, సజ్జల ముందు బానిసలుగా తలవంచుకొని బతకటమేనని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి భీమవరపు సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ బీసీ నేతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని, డాక్టర్ సంజీవ్ లాగానే మరికొద్ది రోజుల్లో చాలా మంది బీసీ నేతలు పార్టీని వీడుతారన్నారు. జగన్ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, అనేకమంది బీసీలను పొట్టన పెట్టుకున్నారని, వైసీపీలో బీసీలకు రాజకీయ భవిష్యత్ లేదని, బీసీలంతా ఏకమై టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయాలని సుబ్బారావు పిలుపు నిచ్చారు.





కాంగ్రెస్ రాష్ట్ర నేతలకు స్వాగతం పలికిన చిలకలూరిపేట కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పాలిత రాష్ట్రంగా మార్చటమే లక్ష్యం

● రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాగూర్

చిలకలూరిపేట, జనవరి 11: ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీని గెలుపుబాటలో నడిపించే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్నామని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాగూర్ గురువారం అన్నారు. విజయవాడ నుంచి ఒంగోలులో జరిగే యువజన కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొనేందుకై వెళ్తున్న సందర్భంలో మాణిక్యం ఠాగూర్‌తో పాటు పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, కాంగ్రెస్ నేతలు జంగా గౌతమ్, సుంకర పద్మశ్రీ, రాకేష్‌రెడ్డిల బృందానికి చిలకలూరిపేటలో నరసరావుపేట సెంటర్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఎం.రాధాకృష్ణ నాయకత్వంలో పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాణిక్యం ఠాగూర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనకు, బీజేపీ, టీడీపీ, వైసీపీ పాలనకు మధ్య గల వ్యత్యాసాన్ని ప్రజలు బేరీజు వేసుకొని కాంగ్రెస్ వైపు చూడటం ప్రారంభించారన్నారు. దీనికి తోడు కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుండటంతో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ మాత్రమే మేలు చేయగలుతుందనే విశ్వాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకుడు నాగమధుయాదవ్, చిలకలూరిపేట కాంగ్రెస్ నాయకులు ఎం.ప్రసన్న, గోవిందు శంకర్‌శ్రీనివాస్, ఉప్పుటూరి అనీల్‌కుమార్, ఎలికా శివపార్వతి, కరీమూన్, ఎం.శ్రీనివాసరావు, శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మిరప సాగుచేసే రైతులకు అవగాహన సదస్సు

యడ్లపాడు, జనవరి 11: మిరప పంటలో వచ్చే తెగుళ్ళు.. చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఏవో సరిత తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా ఏరువాక కో-ఆర్డినేటర్ డాక్టర్ వరప్రసాదరావు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి రమేష్ హాజరై అవగాహన కల్పిస్తారన్నారు. మిర్చి రైతులు సదస్సుకు హాజరై అనుమానాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.

రేపు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

యడ్లపాడు, జనవరి 11: యడ్లపాడు లూథరన్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 13న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు మాజీ ఎంపీపీ కరుణాకర్ గురువారం తెలిపారు. పాఠశాలలో 1990-95 మధ్య విద్యనభ్యసించిన 110మంది విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.